శ్రీనివాసరావు, కోలాచలం, 1854-1919

మాయావాదోత్పత్తిక్రమము

బళ్ళారి, 1926

Record no. 284

Śrīnivāsarāvu, Kōlācalaṃ, 1854-1919

Māyāvādōtpattikramamu

Baḷḷāri, 1926

Record no. 284

Bibliographic Record Target

శ్రీనివాసరావు, కోలాచలం, 1854-1919.
మాయావాదోత్పత్తిక్రమము / కోలాచలం శ్రీనివాసరావుగారిచే రచియింపఁబడినది.- 1. కూర్పు.- బళ్ళారి : కె శత్రుఘ్నరావు, 1926.
40 p. ;24 cm.
Record no. 284

Śrīnivāsarāvu, Kōlācalaṃ, 1854-1919.
Māyāvādōtpattikramamu / Kōlācalaṃ Śrīnivāsarāvugāricē raciyimpam̐baḍinadi.- 1. kūrpu.- Baḷḷāri : Ke Śatrughnarāvu, 1926.
40 p. ;24 cm.
Record no. 284

1097

శ్రీ

మాయావాదోత్పత్తిక్రమము.

ఇది

బళ్ళారిలో వకీలుగానుండి

రి. శే. బ్రహ్మశ్రీ॥ కోలాచలం శ్రీనివాసరావుగారిచే

రచియింపఁబడినది.

వారి జ్యేష్ఠపుత్రుఁడగు కె. శత్రుఘ్నరావుచేఁ

బ్రకటింపఁబడియె.

మొదటికూర్పు.

బళ్ళారి.

ఆంధ్రముద్రాక్షరశాలయందు

ముద్రితము.

1926.

వెల రు. 0—8—0

మాయావాదోత్పత్తిక్రమము.

పురాతనార్యులు పంజాబుఁ జేరకమున్ను బహుదినములక్రిందట వారు ప్రకృతి చిత్రమహిమలుఁజూచి యవి శక్తులనియెన్ని వానిని గౌరవించి నుతింపసాగిరి. అప్పటిలో వారొనరించు పూజలన్నియును వాగ్రూపకమైన నుతులుగ నుండెను. పిదప నగ్నిపూజ ప్రారంభమాయెను. అపుడగ్నికిఁ బాలు, పెరుఁగు, నెయ్యి మొదలగు వస్తువులు బలియియ్యసాగిరి. ఈ పూజలన్నియు నమాయకమైనవిగను నహింసారూపముగను నుండెను. పిదప రాజ్యస్థాపనములు పురోహితవర్గ మేర్పడుటయు సంభవిల్లెను. పురోహితుల ప్రాబల్యానంతరము హింసారూపకములగు బలులిచ్చు యజాశ్వమేధాది యజ్ఞము లారంభమయి ప్రబలించెను. అక్కాలమునకు నార్యులలో ననేకులందుఁ గార్యకారణములను విమర్శించు బుద్ధి యుత్పన్నమయి ప్రపంచోత్పత్తి యెటులయ్యెననియుఁ దా మర్చించు శక్తులకన్నిటికిని మూలశక్తి తత్వమొకటి యుండవలెననియు నాలోచించి తుదకు బ్రహ్మమను దైవశక్తియొకటి యున్నదనియు నా దైవశక్తినుండి యుద్భవించినదే ప్రాపంచిక వస్తుసముదాయమంతయునని యు నిర్ధరించిరి. ప్రారంభమునఁ జిత్రమహిమల నుతించుచుండినవారు ఋషులైరి. పిదప ననేకవిధములగు నాగమవిధులనుఁ గల్పించినవారు బ్రహ్మవాదులైరి. పిదప బ్రహ్మమను శక్తియొకటి సర్వాధారమైన సత్యశక్తి యనియు నాశక్తి సత్త్వమే ప్రపంచ వస్తుతత్వమనియు నిర్ధరించినవారు పరిణామవాదులైరి. వీరు వేదవాదులకు విరుద్ధులుకాకపోయినను జనుల మానసములందు నభిప్రాయ భిన్నతలు గలుగుటచే వేదవాదుల మతము సన్నగిల్లెను. పరిణామలను, వేదవాదులు శత్రువులుగఁ జూచుచుండిరి. వేదవాదులు తామొనరించు నాగమవిధులఫలము గుడ్డివారుగ నూహించుచుండిరిగాని కారణ కార్యరూపకమున జనులకు సమాధానమియ్యఁజాలకైరి. పరిణమవాదులు ప్రతియొక కర్మము యొక్క రహస్యార్థములఁ దెలిపి జనుల జ్ఞానాభివృద్ధికిఁ గారణులైరి. ఈ మతము ప్రబలెను. ఇటులుండఁ గపిలాచార్యులవారు తమ సాంఖ్యమతమునకుఁ బ్రాశస్త్యముఁ గలిగించి పరిణమ వాదమతము నణఁచిరి. ఈ సాంఖ్యవాదు లీశ్వరుని నిరాకరించి "ప్రకృతి పురుష" యను ద్వంద్వరూపకములైన రెండుతత్వములు గల్పించి ప్రకృతి, లేక, ప్రధానమను తత్త్వమునుండి యిరువదిమూఁడు తత్వములుత్పన్నమయ్యెననియుఁ బ్రధాన పురుషయుక్త పంచవింశ తత్త్వజ్ఞానమే మోక్షమనియు మత మేర్పఱచిరి. ఇదియ, నిరీశ్వరవాదము. ఈ కాపిలమత మెటులైన నుండనిండు వీరొనరించిన హేతువాదమును, సిద్ధాంతము లొనర్చువాదమును,

విశేషభాగ మంగీకరించిరి. ఇటులుండఁ గాణాదులనువారు వైశేషిక మతమొకటి కల్పించి వ్యాపింపఁజేసిరి. ఈ మతమునందు శాంతస్వభావమూర్తియగు దైవమొకఁ డున్నవాఁడనియుఁ బ్రపంచమణువుల సంయోగఫలమనియు నాఱుద్రవ్యముల సత్యజ్ఞానమే మోక్షమనియు స్థాపింపఁబడినది. పై సాంఖ్య వైశేషిక మతముల వ్యాపనచే పరిణామవాదుల ప్రాబల్య మొంతోకాల మడఁగియుండి పూర్వ మీమాంసక మత ముద్భవించినతోడనే మఱలఁ దలఁజూపఁ బ్రారంభించెను. అయిన నా పరిణామ వాదమతములోఁ గొన్నిలోపము లుండినందున నా లోపములనెల్లఁ జక్కఁబఱచి మఱికొన్ని యంశములను జేర్చి "మాయ" యను సిద్ధాంత మేర్పఱచినందున మాయావాదము రూఢికివచ్చెను. "మాయ" యననేమి మాయావాదమతమన నేమి యను విషయము చర్చింపకమున్ను పరిణామవాదములోనుండిన లోపము లెవ్వియనునది సంగ్రహముగ వ్రాసెద.

(1) ఉపనిషత్తులలోనేమి వేదముల జ్ఞానకాండలోనేమి, "ఏకమేవాద్వితీయం" యనఁగా దైవమొక్కఁడే రెండవదెద్దియును లేదని పలుకఁబడినది. అయినఁ బరిణామవాదములో ద్వైత మారోపింపఁబడినది.

(2) పరిణామవాదము కారణ కార్య సిద్ధాంతమునకుఁ బ్రారంభముననే విరోధించుచున్నది. కారణ, మే స్వభావముగలదియో కార్యము నదేస్వభావముగ నుండవలెననునది సిద్ధాంతముగదా! ఈ సిద్ధాంతమునకు భంగముగ దైవికద్రవ్యము నుండి ప్రకృతివస్తు సృష్టికలిగెననుటఁ పరిణామవాదదోషము.

(3) ఈ పరిణామవాదమునుండి ప్రపంచములో మన మనుభవించు మేలు కీళ్లకుఁ దగుమయిన కారణములు చూపఁబడలేదు. దైవ మన్నిచోట్ల నుండువాఁడైనచోఁ బ్రపంచములోని దుఃఖములు చూడఁడా? దైవము జ్ఞానస్వరూపుఁడు గదా? ప్రపంచదుఃఖములను దెలిసికొనఁడా? జీవులకు మరణమేల గలిగించెను!

పరిణామ వాదమునందు వీనికి గారణము లుండలేదు. ఈ వాదమునకు వికారవాదమని సైతము పేరు. ఈ వాదమును జక్కపఱచుటకునై మాయావాద ముద్భవిల్లెను.

ఈ సిద్ధాంతమురీతిగ పిండబ్రహ్మాండములోని ద్రవ్యములెల్ల (1) పారమార్థికము, (2) వ్యావహారికము, (3) ప్రాతిభాసికములని మూఁడువిధములుగ విభజింపఁబడినవి. (1) పారమార్థికమనునది సత్యము. ఎల్లకాలములుండునది. మార్పులు లేనిది. (2) వ్యావహారికమనఁగ మనకంటికేగాని మనమునకేగాని నిజముగ నగ

పడుచు నామరూపాదులందుచు మార్పులుజెంది వేఱు నామరూపములంది తుదకు నశించునది. (3) ప్రాతిభాసికమనగా వ్యవహారమునందు నొకవస్తువు వ్యవహారములోనుండు మఱియొకవస్తువుగ నగపడుట. శుక్తిరజితము, రజ్జుసర్పము, మృగతృష్ణజలము, దీనికి నుదాహరణములు. పారమార్థికమనునది బ్రహ్మమేను. మిగత వస్తువులు వ్యావహారికములు. మొదటిది సదాసత్యము. రెండవది వ్యావహారికసత్యమైనను, నసత్యమేను. మూఁడవది భ్రాంతిగ, నసత్యము. ఇది రూపైక్య కారణ జనిత భ్రాంతి. మానసేంద్రియ దౌర్బల్యము. వ్యావహారి కాసత్యము. జ్ఞానేంద్రియ దౌర్బల్యము. ప్రతిభాసికము వ్యావహారికవస్తు నిశ్చయజ్ఞానమున మిథ్యయగును; వ్యావహారికవస్తు సృష్టి సత్యాసత్యముల మధ్యనుండునది. అసత్య పరిణామములగు వ్యావహారిక ప్రాతిభాసికముల సృష్టి మాయాజనితఫలమని మాయావాదుల సిద్ధాంతము. "మాయ" యననేమి? అది చేతనపదార్థమా! అచేతనమా? ఈ విషయములుగొన్ని సంగ్రహముగ నిటు వ్రాయఁబూనెద.

ఈ మాయయనునది పరబ్రహ్మమునందుండు "సహజశక్తి" ఆరోపితశక్తికాదు. ఈశక్తి విభజింపశక్యముగాని సూక్ష్మము. సర్వభక్షకుఁడగు నగ్ని జ్వాలలకు వ్యాపించి భక్షించు శక్తియటులున్నదని మనభావనలోఁ గలుగునో, యదేరీతిగ పరబ్రహ్మమునందలి శక్తియొక్క బల మీ ప్రపంచమున స్పష్టముగ నగపడుచుండును. అయిన నీశక్తి పరబ్రహ్మమే యనుటకునురాదు పరబ్రహ్మము నుండి భిన్నమని యనుటకునురాదు. ఎందుకనఁగా అగ్నియందుఁగల సర్వభక్షకశక్తి యగ్నికాదుగదా? అది భిన్నతత్త్వమని మనమెన్నినచో దానిభిన్నస్థితి యెట్టిదను నదియుఁ దెలుపసాధ్యముకాదుగదా? "వస్తువు-వస్తుశక్తి" యెటు లొకటియుఁగాక భిన్నమునుగాకయుండునో యటులనే పరబ్రహ్మమును మాయయు నొకటియును గాదు వేఱునుగాదని తెలియవలెను. రెండును నవ్యక్తములేను కావుననే యనిర్వచనీయములు. వ్యావహారికభాషలో వానినిఁ దెలుపశక్యముగాదు. జ్ఞానచక్షువులం జూచి యనుభవింపఁదగినవి. వ్యావహారికభాషలో శాస్త్రజ్ఞులుచేసిన పరబ్రహ్మము యొక్క వర్ణన, యజ్ఞులరుంధతీన్యాయమునఁ జాయచాయఁగఁ దెలిసికొనుటకునై వర్ణించిన విషయమని తెలియవలెను. ఈ విషయముఁ దెలియుట కష్టతమము. ఆధిభౌతిక శాస్త్రజ్ఞులిప్పటికిని గొన్నివ్యక్తములగు వస్తువులు శాకాదితరగతికిఁ జేరినవియా లేక క్రిమికీటకాదివర్గమునకుఁ జేరినవియా యనునది తెలియక యున్నవారు. వ్యక్తసూక్ష్మ పదార్థముల విమర్శనకే యిన్నికష్టములుండ నీక నవ్యక్తవస్తు విమర్శన యెంతకష్టమో దైవమెఱుంగును కావుననే ఋగ్వేదఋషులీ సృష్టిరహస్యము

"దైవమున్నదైనఁ దెలియునో తెలియదో" యని సందేహించినారు. ప్రకృతిపురుషుల తత్వమతిసూక్ష్మతమముగ నున్నందున రెండును నొక్కటియయని కొందఱు నిర్ధరించి సర్వసృష్టియుఁ ప్రకృతినుండియె కలిగినదని పరబ్రహ్మమును నిరాకరించు నాస్తికు లయినారు. ఈ మాయాశక్తికే సాంఖ్యులు ప్రధానమనియును వేదాంతులుప్రకృతి యవిద్యయనియు ననేకనామములిడినారు. మాయ, "సత్తునుగాదు, అసత్తును గాదు" అని చెప్పుటకుబడునట్లుగ నది యొక సూక్ష్మతమమైన యవ్యక్తతత్వమని యనికొందుము. ఏవస్తువును లేకయే, దైవము ప్రపంచమును సృష్టించెనని హీబ్రూ జాతివారు పలికినరీతిఁగాక, మనవేదాంతు లీమాయాతత్వమునుండి యేసర్వ ప్రపంచము సృష్టింపఁబడెననుటలో నేవిరుద్ధమునుండదు. "పరబ్రహ్మము, చైతన్య స్వరూపమునుగాని జడవస్తువుగదా, అట్టివస్తువుకు సృష్టిసంకల్పమెటుగలిగె" నని కొందఱాక్షేపింతురు. ఇది సాంఖ్యశాస్త్రమునుండి గలిగిన యజ్ఞానఫలము. మాయావాదులు పరబ్రహ్మము సచ్చిదానందమూర్తియనియును నిత్యశుద్ధబుద్ధముక్తుఁ డనియునుఁ బలికెదరు గావున పై యాక్షేపణమునకు మార్గము లేదు. కావున దన స్వాభావిక మాయాశక్తికిఁ జలనము గలిగించుటయుఁ బిదప నామాయాశక్తి యనేకరూపములగు వస్తువులుగలిగించుటయు దైవముయొక్క యిచ్ఛాశక్తి, లేక, సంకల్పమని పిలువఁబడుచున్నది. స్వాభావిక మాయాశక్తికిఁ జలనముఁగలిగించిన నిమిత్తకారణమునఁ బరబ్రహ్మమునకు సృష్టికర్తృత్వ మారోపింపఁబడినది. సాంఖ్యులు పురుషుఁ డుదాసీనుఁడందురు. దానిని మాయావాదులు సమ్మతింపరు. పరబ్రహ్మము నిష్కల్మషచైతన్య స్వరూపముగదా? అందులోఁ గల్మషఖనియగు మాయ యెటు లుండునని కొందఱాక్షేపించెదరు. మేమిదివఱలోఁ బరబ్రహ్మముయొక్కశక్తి మాయయని పలికినాము. ఇఁక మాయయొక్క స్వాభావికమగు శక్తినుండి సృష్టి ప్రారంభమైనది కల్మషాకల్మషములు మాయాశక్తివిశేషణములు. ఈ మాయాశక్తి దైవశక్తితో గూడియుండును. అకల్మషము దైవశక్తి. కల్మషము మాయాశక్తి. ఈ రెండుశక్తులు భిన్నముగ నుండునవికావు. కల్మషవృత్తినిఁ దొలఁచి యకల్మష వృత్తిలోఁ గలపుట యమానవకర్తవ్యము, కల్మషమనునది యజ్ఞానము. ఈ యజ్ఞాన మెటువచ్చెనన నది మాయాశక్తికిఁగల యొకలక్షణము. అటుపలకనిచోఁ బరబ్రహ్మ శుద్ధత్వమునకే సందేహముకలుగును. పరబ్రహ్మములే రెండు కావలసివచ్చును. "జ్ఞానపరబ్రహ్మము, అజ్ఞానపరబ్రహ్మము" అని పరబ్రహ్మములుగ నుండవలెను. ఇది, యేమతమువారి సిద్ధాంతమునుకాదు. కావున నజ్ఞానమనఁగా నవిద్య, మాయాశక్తియని తెలియుటయు సరియయినకారణమని చెప్పఁదగును.

మాయాశక్తి తన యభేదదశలో ననఁగా పంచమహాభూతము లింకను జనింపకమున్ను సూక్ష్మతమమై పిదప సూక్ష్మతరమై సూక్ష్మమై యాకాశాది పంచమహాభూతము లుద్భవించుటకుఁ గారణమాయెను. ఈ మాయాశక్తియొక్క స్వభావము నైజతత్వములందు మార్పులుచేయుట. ఇట్టిమార్పులచేతనే ప్రపంచ మాయెను. ఈ తత్వము లెవ్వియును శాశ్వతముగ నొక్కరూపమున నిలుచునవి కావు గనుక నివియన్నియును మిథ్యలని మాయావాదులు పలికెదరు. మిథ్య శబ్దార్థమును దెలియక కొందఱు వితండవాదములు సేయుచున్నవాడు. ప్రపంచములోఁగల సర్వవస్తువులును సూర్యచంద్రాది గ్రహములతోసైతము కాలానుసారముగ మారుచుండును. ఇది మాయాశక్తి చిత్రమహిమ. పుట్టుటకుఁ బ్రారంభ మెద్ది మార్పునకు నంత్యమెద్దియనుట తెలుపుటకురాదు కావుననే యాద్యంతములు లేవని జ్ఞానులాడిరి.

ఈ మాయయొక్క మఱియొక స్వాభావిక లక్షణమైంద్రజాలము. ఈ శక్తిచే జనులీప్రపంచమును ప్రాపంచికవస్తువులు సర్వమును సత్యములని నమ్మెదరు. సత్యమనినమ్మి వాని నందుటకు సర్వప్రయత్నములు సేయుచుందురు. తుదకు నవి యసత్యములగును.

మాయకును, నవిద్యకును, భేదమేమియును గీతలోనేమి, వేదాంత సూత్రములలో నేమి చూపఁబడలేదు. ఉత్తర వేదాంతగ్రంథములలో మాత్ర మీరీతిగఁ దెలుపఁబడినది. ఆత్మయును బ్రహ్మమును మూలమున నొక్క స్వరూపముగనున్నను నాచిత్స్వరూప బ్రహ్మము మాయలోఁ బ్రతిబింబించినపుడు సత్త్వరజస్తమో గుణాత్మకమైన ప్రకృతి నిర్మాణమగును. మఱల నామాయ రెండువిధములగును (1) మాయ (2) అవిద్య. త్రిగుణములలో శుద్ధసత్వ గుణమెప్పుడుత్కర్షతఁ జెందునో యపుడది మాయయనఁబడును. దానిలోఁ, బ్రతిబింబించిన బ్రహ్మము సగుణస్వరూపియగు నీశ్వరుఁడగును. ఆ సత్త్వగుణ మితరగుణ మిళితమై యించుక యశుద్ధమైనపుడది "అవిద్య" యనిపించుకొనుననియు దానిలోఁ బ్రతిబింబించిన బ్రహ్మము జీవుఁడనియుఁ బలుకఁబడినది. పై వర్ణనఁబట్టిచూడ మాయ, యీశ్వరోపాధియనియును "అవిద్య" జీవుని యుపాధియనియును దెలియవచ్చుచున్నది. "అవిద్యా" యనుశబ్దము గీతలోలేదు. శ్వేతాశ్వతరోపనిషత్తులోనున్నది.

"అవిద్య" యనఁగా ఈశ్వరస్వరూపమును గప్పివేసి యనేకవిధ విచిత్ర పదార్థములను జీవునకు స్ఫురింపఁజేయునది. అవిద్యాదులచేఁ గప్పఁబడి

నదియే జీవుఁడు. ఈ యవిద్య యీశ్వరోపాధియగు మాయావికారము. ఇదిసత్త్వ రజస్తమోగుణ రూపమైయుండును. అవిద్య సమష్టిని నొక్కటేయైనను ననేకాంతఃకరణములుగ మారును. వానియందు సంగతమైన బ్రహ్మచైతన్య మనేకజీవులుగ భాసమానమగుచుండును. నిజముగ జీవుఁడొక్కఁడేను. అవిద్యాకామ కర్మాదులతోఁ జేరినది జీవచైతన్యము. అవిద్యకు రెండుశక్తులున్నవి. ఆవరణశక్తి, విక్షేపశక్తి. ఆవరణశక్తి వస్తువుయొక్క స్వరూపమును గప్పివేయును. విక్షేపశక్తి, యొకవస్తువును మఱియొకవస్తువుగ నగపడఁజేయును. ఈ విక్షేపశక్తి జీవన్ముక్తునందు సైతము ప్రారబ్ధసమాప్తివఱకు నుండును.

మాయ:—ఇది యిట్టిదియని వర్ణింప శక్యముకాదు. కావుననే యనిర్వచనీయము. బ్రహ్మముకంటెను వేఱనిగాని వేఱుకాదనిగాని తెలుపరాని యొకభావరూపమగు పదార్థము. ఇది శుద్ధ సత్త్వగుణముతోఁగూడి, యీశ్వరాధీనముగ నుండును. ఈ మాయ సత్త్వరజస్తమో గుణాత్మకమైనను, శుద్ధ సత్త్వాన్వితమై ఈశ్వరుని స్వరూపముగ నగపడును. ఈశ్వరతత్త్వమీ మాయచేఁ గప్పఁబడినకతంబున నీశ్వరునందు నధ్యాసభ్రమ కలుగుటకుఁ గారణమయ్యెను. అధ్యాసమనఁగా:— నైజముగఁ దనయందులేని యన్యవస్తువుల గుణమును, దనపై నారోపించుకొనడము. ఈ యధ్యాస మహంకారాధ్యాసము మమకారాధ్యాసమని రెండువిధములుగ నుండును. జీవునకు మాయ, అవిద్య, అంతఃకరణమను మూఁడావరణములుగలవని కొందఱిమతము. మాయ యీశ్వరస్వరూపమనియు అవిద్య కారణ శరీరమనియు నంతఃకరణము సూక్ష్మశరీరమనియుఁ దెలుపఁబడినది. మాయతోఁ జేరినది కర్మము లేక క్రియ. అటుభావింపనిచో "సృష్టి" కలుగుటకే కారణముండదు. కావున మాయతో సైతము కర్మమనాదియని చెప్పవలసినదిగనున్నది. సృష్ట్యారంభమున మూలావ్యక్త నిర్గుణ పరబ్రహ్మము, దేశకాలాది నామరూపాత్మక సగుణముగ వ్యక్తమయి దృశ్యసృష్టిరూపముగ నగపడులాగొనరించిన దెద్దియో దానినామము వేదాంతులు "మాయ" యని వాడినారు. అనఁగా నామరూపముచే "మాయ' యని యర్థము సేయనగును. మానవుల యింద్రియములకు గోచరముగాని యీ "మాయ" పరబ్రహ్మముయొక్క యతర్క్యమగు శక్తియని పిలువనగునని మాయావాదులందురు. ప్రకృతిస్వరూపమగు నీ త్రిగుణాత్మకమాయ మానవుల యింద్రియమయమై నిర్గుణబ్రహ్మమును సగుణబ్రహ్మముగ నగపడులాగున గుణము లారోపించుచుండును. ఇది యావరణ విక్షేపశక్తులఫలము.

ఈ మాయను నజ్ఞానమనియును, నవ్యాకృతమనియును, నవ్యక్తమని

యును వేదాంతులు వాడెదరు. స్వతంత్రమనియును, ప్రధానమనియును, మూలప్రకృతియనియును, ప్రకృతియనియును, సత్త్వరజస్తమోగుణముల సామ్యావస్థయనియును, సాంఖ్యాదులు పలికెదరు.

ఈ మాయక్రియాకారి, అవ్యక్తముగ నుండినను దీనఁగార్యములు వ్యక్తములు. ఇది యనాది సాంతమైనది.

ఈ మాయావాదము వేదాంతవాదమునకు విశేషముగ భిన్నముకాదు.

మాయావాద సారాంశమేమనఁగా:- ప్రపంచము బ్రహ్మమువలె సత్యము కాదు. మాయ బ్రహ్మముతోఁ గూడియున్నను నది యసత్యమేను. బ్రహ్మముకంటెఁ బ్రపంచము వేఱనుతలంపు మాయాకార్యమగు భ్రమయనియును నది బ్రహ్మసాక్షాత్కారముచే నశించుననియును దెలుపఁబడినది. అనఁగా నిర్విశేష బ్రహ్మమునందు మాయ యవ్యాకృతమై ప్రపంచరూపముగఁ బరిణమించినదను మాయావాదము శ్రుతిసిద్ధమైనదని యనేకులు యూరోపియన్ లభిప్రాయపడినారు.

ఈ మాయావాద సిద్ధాంత ముత్పన్నమగుటకుఁ గారణములు సంగ్రహముగఁ బ్రారంభమున వ్రాయఁబడినవి. మాయావాద మేమయినదిన్ని కొంచెమయినను దెలియక మిగతవాదములు తెలిసికొనుట కష్టమని యెంచి వానినపుడు సూక్ష్మముగవ్రాసి యిపుడు వానిని విస్తరించి తెలుప బ్రారంభించెద. పరిణామవాదానంతరమున సాంఖ్యసిద్ధాంత మేర్పడెనని నేనిదివఱకే దెలిపినాను. సాంఖ్యశాస్త్రోద్దేశము మానవుఁడెటుల దుఃఖపరంపరలనుండి తప్పించుకొనునను విషయము నిర్ధరించుట కపిలాచార్యులు తమశక్తినంతయును వెచ్చిరచి యాలోచించి ఈశ్వరతత్త్వము తర్కప్రమాణములరీతిగఁ దృప్తికరముగ నిర్ధరింపఁజాలక యీశ్వర తత్త్వస్థితికి ప్రమాణములులేవనిపలికి యీశ్వరతత్త్వమునువదలి జగత్సృష్టికి జక్కనిసిద్ధాంతమొనర్చిరి. ఈ సిద్ధాంతములోఁ గొన్నిలోపములున్నను వానినన్నియును సొక్కటిగ సవరించికొని మిగతసిద్ధాంతములు కృష్టినపుటకు నేమందియమును లేదు. దుఃఖములు (1) ఆధ్యాత్మికము (2) ఆధిభౌతికము (3) ఆధిదైవికము." అని మూఁడువిధములు. ఈ దుఃఖములబాధ పురుషునకు నంటనటుల వానినిఁ దొలగింపవలెను. పురుషుని నీ దుఃఖపాశమెట్లు బంధించుననిన నజ్ఞాన కారణంబని పలుకఁబడెను.

సాంఖ్యసిద్ధాంతము రీతిగఁ బురుషు లనేకులనియును, ప్రధానసత్త్వ సంబంధములు కావనియు స్వతంత్రములనియును నవి సర్వవ్యాపకములనియు

చలనరహితములనియు జడములనియు వచింపఁబడినది. ఆ పురుషులు స్వయంభవులుగను, స్వతంత్రులుగను జ్ఞానస్వరూపులుగను వర్ణింపఁబడినారు.

ప్రకృతి సత్యమైనది, అవ్యక్తమైనది, వివేకశక్తిలేనిది. ప్రళయస్థితిలోనుండు నపుడు తప్ప మిగతకాలమునందు సర్వదా చలించునది. పురుషప్రకృతులు రెండును ననాదులనియు నవ్యక్తులనియు నవిభజ్యులనియును బలుకఁబడెను. అయినఁ బ్రకృతి స్వాభివృద్ధికై సదా చలించుచుండును. ఆ యభివృద్ధి తన లాభమునకుఁగాదు. పురుషుల యనుభవమునకు ప్రకృతియందు సత్వరజస్తమోగుణములు స్వాభావికముగఁ గలిగియున్నవి. ఈ త్రిగుణలక్షణములు వేఱుగ వ్రాయఁబడును.

సాంఖ్యులకుఁ బ్రత్యక్షానుమానాప్తవచనములనునవి మూఁడే ప్రమాణములు. ఆప్తవచనములన వేదవచనములని వారియర్థముగాదు. వేదములనాదియనియు దైవవచనములనియు వారు నమ్మరు. అందునఁ గర్మకాండమును బొత్తిగనమ్మరు.

పైన వ్రాయఁబడిన త్రిగుణకృతకర్మములు మనస్సును బంధించుచుండుననియు నట్టి బంధయుక్త మనస్సాత్మయందుఁ బ్రతిబింబించుటచేఁ బురుషుఁడు తాననుబంధింపఁబడినట్టు లెన్నుననియు సాంఖ్యులు కొందఱాడెదరు.

ప్రకృతి సర్వశక్తిగలతత్త్వము. త్రిగుణాత్మకము. అది స్వేచ్ఛగఁ దనశక్తి నగపఱచును. జ్ఞానహీనమైనను దనకుఁదానే తనస్వాభావిక శక్తిచేఁ జలించును. తప్పుమార్గముపట్టదు, అపుడుసృష్టి ప్రారంభమగును. ప్రకృతినుండి "బుద్ధి" పుట్టును. ఇది మంచిచెడ్డల వివేచించుజ్ఞానశక్తి; ఇది స్వచ్ఛతత్త్వము గాన మహత్తని పిలువఁబడును. దీనినుండి "అహంకార" తత్త్వము జనించెను. ఇది "నేను" "నాది" "నాదికాదు" అని వేఱుపఱచుతత్త్వము. ఇది యనేక సుఖదుఃఖములకు మూలాధారమయినది. ఈ "అహంకార"ము నుండి పంచతన్మాత్రలు గలిగెను. ఇవి శబ్దస్పర్శ రూపరసగంధములను సూక్ష్మతత్త్వములు సామాన్య మానవ దృగ్గోచరములుగావు. ఈ యేడు తత్త్వములున్ను ప్రకృతి జన్యములగుటయగాక యితరతత్త్వముల జనింపఁజేయు సామర్థ్యముగలవి. ఈ యేఁడుతత్త్వముల స్వేచ్ఛాచలనమువలనఁ మిగత పదునాఱు తత్త్వములు జనించెను. అవి జనించినవిగాని జనింపఁజేయు సామర్థ్యములేనివి. అవి యెవ్వియనః- పృథ్వి, అప్పు, తేజస్సు, వాయువు, ఆకాశములను 5 మహాభూతతత్త్వములు.

చక్షుః శ్రోత్ర ఘ్రాణ జిహ్వా త్వక్కులను 5 జ్ఞానేంద్రియములు.

వాక్పాణి పాదపాయూపస్థలను 5 కర్మేంద్రియములు.

దీనికిఁ జేరికగ మనోతత్త్వమొకటి జనించెను.

పంచమహాభూతములు పంచతన్మాత్రలచే జనింపఁబడినవి. జ్ఞానేంద్రియ పంచకమున్ను కర్మేంద్రియ పంచకమున్ను మనస్సున్ను నహంకారతత్త్వముచే జనింపఁబడినవి. ఈ మనస్సను తత్త్వమే పైన పలుకఁబడిన యాధివ్యాధుల దుఃఖవాసనల బంధింపఁబడి పురుషునిపైఁ బ్రతిబింబించునది. దీనినుండి ముక్తినందవలెననునదియే సాంఖ్యుల ముఖ్యసిద్ధాంతోద్దేశము. ఈ తత్త్వములలోఁ గొన్ని మానవుల దృగ్గోచరములుగావున ప్రత్యక్షప్రమాణముల సిద్ధపడుననియు మిగతవి జ్ఞాన దృగ్గోచరములుగావున ననుమాన ప్రమాణముపై నిర్ధరింపఁదగినవనియుఁ దెలుపఁబడినవి. ఇఁక నిరువదియైదవ తత్త్వమగు పురుషుఁడు జనించిన వాఁడునుగాఁడు జనింపఁ జేయువాఁడునుగాఁడు. అయినను బ్రకృతి తనశక్తిచే సృష్టించిన వస్తు సముదాయ లాభము తానే యనుభవింపఁజాలని కారణంబునను ననుభవించువాఁడు లేనపుడు ప్రకృతి సృష్టి వ్యర్థమగునను కారణంబునను ననుభవించు తత్త్వమొకటి యుండవలెనని పురుషుఁడు గల్పింపఁబడెనని సాంఖ్యశాస్త్రమున వచింపఁబడినది. ప్రకృతి జడమైనందున ననుభవింపఁజాలదు. పసుపునించినబండి పసుపును మోసికొనిపోవడము తన యుపయోగమునకుఁ గాదుగదా; ఆవు పొదుగులోఁ బాలునించికొనుట దూడయుపయోగమునకుగాని తనయుపయోగమునకుఁ గాదుగదా? పురుషుఁడు చలనములేని జడమాయెను. ప్రకృతియును జడతత్త్వమేను. అటులున్నపుడు జడప్రకృతికి చలనశక్తి యెటుకలిగెననినఁ బురుష సంయోగమునుండియని పలికిరి. పురుషుఁడును జడుఁడుగదా? ఒక జడశక్తి మఱియొక జడశక్తికిఁ జలనంబుఁ గల్పింప శక్యమాయని ప్రశ్నించినచో, సూదంటుఱాయి జడమైనను, మఱియొక జడపదార్థమగు నినుమును జలింపఁజేయదా? పసుపువర్ణముగల యొకవిధమయిన రత్నము తృణమును జలింపఁజేయదాయని బదులిడెదరు.

జననము మరణము మొదలగు స్థితులు వేఱువేఱుగ నగపడుచున్న కారణంబునఁ బురుషులనేకుల నిర్ధరించిరి. అటుకానిచో నొకఁడు పుట్టినపుడు సర్వులు పుట్టవలసివచ్చును. ఒకఁడు చచ్చిన సర్వులు చావవలసివచ్చును. ఒకనికి వ్యాధి కలిగిన సర్వులకు వ్యాధి కలుగవలసివచ్చును. ఒకఁడు ముక్తుఁడైన సర్వులు ముక్తులుకావలసివచ్చును. ఇట్టి యనర్థము లనేకములు కలుగవలసివచ్చును కావునఁ బురుషు లనేకులని నిర్ధరింపఁబడినది. పురుషు లనేకులయినను ప్రకృతిమాత్ర మొకటేను. ఒకటయినచో ననేకవిధ వ్యక్తస్వరూపములుగ నగపడుచున్నదియే యని ప్రశ్నించినచోఁ బ్రకృతి త్రిగుణాత్మకమైనదనియు నాగుణముల మహిమచే ననేక

విధములగు వ్యక్తస్వరూపము లగపడఁజేయుననియుఁ బలికిరి.

సాంఖ్యులు పునర్జన్మము విషయములో నీవిధముగఁ బల్కుచున్నారు.

మనోబుద్ధ్యహంకారములును పంచతన్మాత్రలున్ను గూడి లింగశరీరమై స్థూలశరీర నాశనానంతరము పురుషునితోఁగూడ మఱియొక స్థూలశరీరములోఁ జేరి జన్మమెత్తుచుండునని నిర్ధరించినారు. లింగశరీరము స్థూలశరీరమునకంటెను సూక్ష్మమైనదియు నశ్వరమైనదనియు నవ్యక్తమైనదనియు, శరీరముచేఁ గట్టఁబడక శరీరములోనే స్వతంత్రముగ నుండుననియు నీ శరీరము తా ననుభవించునది కాకపోయినను నీతిస్వభావముకలది యనియుఁ బలికిరి. ఈ లింగశరీరము పురుషునిఁ జుట్టియుండుననియు స్థూలశరీరమునుండియు లింగశరీరమునుండియు పురుషునిఁ దప్పించుట ముక్తియనియు వీరిసిద్ధాంతము.

పైన వ్రాయఁబడిన సాంఖ్యసిద్ధాంత సంగ్రహమునుండి మనము గొన్ని విషయములు గ్రహింపనగును.

(1) సృష్టిశక్తిగల ప్రకృతి (2) సృష్టిశక్తిలేని వికృతి (3) సృష్టింపఁబడిన వయ్యును తాము సృష్టించుశక్తిగల వికృతులు (4) సృష్టింపఁబడినదియునుగాక సృష్టించు శక్తియునులేక యుండునది.

(ఎ) సర్వసృష్టికిని మూలమైనది ప్రకృతి మొదటిది.

(బి) బుద్ధ్యహంకార పంచతన్మాత్రలు తాము ప్రకృతివలన సృష్టింపఁబడిన వయ్యును, జ్ఞానేంద్రియ కర్మేంద్రియాది షోడశవికృతులను బుట్టించి నవి రెండవది.

(సి) పదునారు వికృతులు మూఁడవతరగతివి.

(డి) పురుషుఁడు:—— నాల్గవతరగతికిఁ జేరినవాఁడు.

సాంఖ్య సిద్ధాంతమురీతిగ బద్ధుఁడగుటకుఁ గారణ మజ్ఞానముకాని పాపముగాదు, ముక్తికిఁగారణము జ్ఞానముగాని పుణ్యముకాదు. పుణ్యపాపములు రెండును బంధకారణములేను. పుణ్యమనునది స్వర్గసుఖము కొంతకాలమిచ్చి మఱలఁ గ్రిందికిఁ దెచ్చును. అంతయగాని ముక్తికిఁ గారణముగాదు.

సాంఖ్యులు ప్రకృతిని సద్వస్తువనిరి గావున వారిసిద్ధాంతమురీతిగ సత్తు నుండి సత్తు పుట్టినట్లాయెను.

బౌద్ధులు (సౌగతులు) అసత్తునుండి సత్తుపుట్టెననిరి.

నైయాయికులు సత్తునుండి యసత్తుపుట్టుననిరి.

మాయావాదులు సత్తునుండి మాయాసృష్టియగుననియు ఆ సృష్టి యంతయును నసత్యమనిరి.

బౌద్ధులయసత్తనఁగా:—— ఏమియులేదని (Void) యర్థము.

నైయాయికులయొక్కను మాయావాదులయొక్కను సచ్ఛబ్దార్థము పరమాత్మ.

ఈసత్తు అసత్తు శబ్దార్థములు ఋగ్వేదమునందనేక స్థలములందు విరుద్ధార్థములిచ్చులాగు నుపయుక్తములైనవి కావుననే యిన్ని భిన్నవాదములకుఁ గారణములాయెను.

సాంఖ్యపురుషుఁ డింద్రియాది కరణములులేనివాఁడు బుద్ధిరహితుఁడు జడుఁడై శాంతత్వమున నుండువాఁడు. ఆలోచనాశక్తిలేదు. సృష్టిస్థితిలయములలో నే సంబంధమును లేనివాఁడు. ఇట్టివాఁడు సర్వమునుజూచి యనుభవించువాఁడని పలకుట వ్యర్థముగాని యర్థయుక్తముకాదు. పురుషుని బద్ధునిఁజేయుటకు నే విధముగను మార్గములేదు కావున వానిముక్తియనునది సకారణముగలేదు. ప్రకృతి తనకాళ్లకుఁదానే సంకెళ్లుతగిలించుకొని వదలించికొనుటకు శ్రమపడుచున్నదని సిద్ధాంత మేర్పడుచున్నది. సర్వులు నీతత్వముల జ్ఞానమార్జించుటకు ధ్యానాది యోగనిష్ఠలో నుండవలెనని సర్వులను కర్మభ్రష్టులనుజేసి సన్యాసులగునట్టుల బోధించుచున్నది. బౌద్ధులమత మించుమించుగనిదియేను. సృష్టిక్రమమేమో బాగుగ నున్నదిగాని దైవములేని సృష్టియయినది. ఈమతమున నాక్షేపణాంశములు బలముగనున్నవి వానినన్నిటిని వ్రాయ నిదిసమయముగాదు. ప్రస్తుతాంశమునకుఁ బైన వివరించినభాగము చాలుననితోఁచెడు. ఈ సాంఖ్యుల నిరీశ్వరవాదము సంపూర్ణముగ నడచుటకున్ను వైశేషికులవాదములలోని గొన్నివిషయము లాక్షే పించుటకు వేదాంతసిద్ధాంత మేర్పడెను.

ఇక వైశేషిక సిద్ధాంతమునుగుఱించి వివరించి వ్రాయవలెననిన గ్రంథ బాహుళ్యమగును. అయినను ముఖ్యభాగములఁగొన్ని సూక్ష్మముగ సాధ్యమైనంత వఱకు వ్రాయఁబూనెద. ఈ సిద్ధాంత కర్తకాణాదుఁడు. ఇది గౌతముని నైయాయిక శాస్త్రమును బోలినది కావున న్యాయశాస్త్రవర్గములోనే చేర్పఁబడినది. గౌతముని న్యాయశాస్త్రమునందు జ్ఞానవిషయములు తెలియుటకుఁగా ననేకవిధముల చర్చ జరిగి సిద్ధాంతమేర్పడినది. కాణాదుఁ డాకాగములనుగుఱించి సంక్షేపముగావ్రాసె

యాధిభౌతిక ద్రవ్యవిచారము హెచ్చుగ సలిపినాఁడు. ఇప్పటిలో నాధిభౌతిక శాస్త్రజ్ఞులు ద్రవ్యవిమర్శనలోఁ గనుఁగొనిన విషయములన్నియు నిప్పటికి నాలుగు వేలేండ్ల క్రిందటనే కాణాదుఁడు కనిపెట్టెను. కాణాదుని మతమునీరీతిగఁ బ్రపంచములోని వస్తుతత్త్వము లన్నియును నాఱుతరగతులుగ విభజింపఁబడినవి. అవి (1) ద్రవ్య (2) గుణ, (3) కర్మ (4) సామాన్య (5) విశేష (6) సమవాయ. ఈ యాఱుతరగతులకు "అభవతి" యను తత్త్వమునుఁ జేర్పఁబడినది. పై తరగతులలో నొక్కొకదానిక్రింద వచ్చునట్టి యనేకవిషయములు వ్రాయఁబడినవి. పై తత్త్వముల జ్ఞానమేముక్తియని పలుకఁబడినది.

ఇది యణువాద సిద్ధాంతము. వస్తుసూక్ష్మ తత్త్వము లణువులనఁబడును. ఈ సూక్ష్మతత్త్వము లొక్కటొకటిగఁ జేరిద్వ్యణుకములగును. ఇటులనేకములు క్రమక్రమముగఁ జేరి లోకములాయెను. ఈ తత్త్వములు నాలుగుతరగతులున్నవి. (1) భౌమికతత్త్వము (2) జలతత్త్వము (3) వాయుతత్త్వము (4) తేజోతత్త్వము. భౌమికతత్త్వము:- రూపస్పర్శ జిహ్వాఘ్రాణ లక్షణములుగలది. జలతత్త్వమున రూపస్పర్శ జిహ్వాలక్షణములుగలది. వాయుతత్త్వము. రూపస్పర్శములుగలది తేజస్తత్త్వము రూపమొక్కటియగలది. ఈ లక్షణములుగల తత్త్వములు స్వజాతి సంయోగాపేక్షలుగలవి కావుననే యాయాతరగతి యణువు లాయాతరగతికే చేరుచుండును. ఇటుచేరుట దైవశక్తియనుగాదు తత్త్వముయొక్క స్వాభావిక గుణమునుగాదు. అదియొక యదృష్టశక్తిలక్షణము. వెనుకటి జన్మమునఁ జేయఁబడిన పుణ్యపాప కర్మముల వాసనాశక్తికి నదృష్టమనిపేరు. ఈ మతమునందాకాశతత్త్వములేదు.

హిందువుల న్యాయసిద్ధాంతములన్నియు నణువులనుండి లోకములవఱకు నభివృద్ధియగునని వ్రాయఁబడినవి. పాశ్చాత్యులలో బెక్కుసిద్ధాంతము లీరీతిగనే యుండును.

ఆత్మయున్నదనుటకు ననేకములగు కారణములు చూపఁబడినవి.

(ఏ) వస్తుగ్రహణేంద్రియములకు స్వతః జ్ఞానములేదు కావున జ్ఞానముగల మఱియొకశక్తి దేహమునందుండవలెను.

దైవికముగాని భౌతికవస్తువుల కా జ్ఞానములేదు. మనస్సుగూడ మీ తరగతిలోఁ జేరినదేను. అచేతనపదార్థములకు జ్ఞానశక్తిలేదు కావున చేతనముఁగల యొకతత్త్వముండవలెను. అది యాత్మయేను.

(బి) ఊపిరినిబిల్చుట, వదలుట; కనుఁగవ, పెదవులు మూయుట తెఱచుట మానసచలనము; అంగవిన్యాసము; సంతోషదుఃఖములు; ఆశాపేసహ్యములు, కార్యేచ్ఛయీ మొదలగునవి యాత్మయున్నదనుటకు చిహ్నములు.

ఆత్మ యున్నదనుటకు మఱియుఁ గొన్నికారణములు చూపఁబడినవి ఈ తర్కశాస్త్ర సిద్ధాంతు లహంకారతత్త్వ మాత్మగ భావించినటులఁ గొన్ని సూత్రము లర్థమిచ్చుచుండును. ఆత్మలనేకములని వీరిమతము.

ఆత్మ, నిత్యము, అవ్యక్తము, స్వచైతన్యము. జ్ఞానేచ్ఛాశక్తులుగలవి జడముగాదు. కావున నది జ్ఞానమూలము. తెలిసికొను శక్తిగలది. క్రియాశక్తియను దానిని గ్రహశక్తియునుగలది. కార్యమొనరించు నిచ్ఛ, సహ్యాసహ్యములు, సుఖదుఃఖములు, జ్ఞానము మొదలగునవి యాత్మలక్షణములు. మానస తత్త్వమూలకమునను జ్ఞానేంద్రియముల మూలకమునను బాహ్యప్రపంచ సంబంధము కలిగియుండును.

ఈ మతమువారు బ్రహ్మము విషయమున గొన్నిసూత్రములు సందిగ్ధార్థములుగఁబలికి పిదప సర్వవస్తుసృష్టికిని నదృష్టమే కారణమని నిర్ధరించినారు.

వైశేషిక మతసిద్ధాంతము లన్నియును వివరముగ వ్రాయవలెననిన నది యొక్కటియే యొకగ్రంథమగును. ముఖ్యముగ మనము దీనినుండి తెలియఁదగిన విషయమేమనఁగా:—

పూర్వజన్మ పుణ్యపాప కర్మముల ఫలమే మన జీవమనియును, మనమీ జన్మమునఁ జేయు పుణ్యపాప కర్మములును మన నడవడికల ఫలములును పూర్వజన్మ ఫలమునకుఁ జేరుననియు ధ్యానాది యోగబలమున మంచిఫలము దొరకుననియు మనకు ముక్తి దీనివలనఁ గలుగుననియు నన్నిటికిని నదృష్టమే కారణమనియుఁ దెలియవచ్చుచున్నది. దీనింబట్టిచూడ మానవుని క్షీణోన్నతులకు వాని యదృష్టమే కారణమాయెను. ఫలాఫలములు మానవుఁడొనరించు కార్యముపై నాధారపడును కావున కర్మము సృష్టికిఁ గారణమగునుగాని దైవముకాదని యేర్పడును.

మనుజుఁడు నశింపఁ జేయఁదగిన విషయములాఱని వైశేషికులు నిర్ధరించిరి. అవి యెవ్వియన:—

(1) అసత్యజ్ఞానము (2) పాపకర్మములు (3) సహ్యాసహ్యతలు (4) కర్మాపేక్షలు (5) దుఃఖము (6) జననము. ఇటు రక్షించి యభివృద్ధినందింపఁ

దగిన దేద్దియన “ సత్యజ్ఞానమేను ” ఆత్మయెద్ది? ఆత్మకానిదెద్ది! అనునది నిజముగఁ దెలిసికొనుట సత్యజ్ఞాన మనఁబడును. ఇట్టిజ్ఞానము ధ్యానాది యోగములచే సిద్ధించును.

సృష్టియందును మనుజులను బద్ధులఁ జేయుటయందును దైవమునకు నే సంబంధమును లేదని యర్థమిచ్చునట్టి సూత్రము లనేకములున్నవి. అదృష్టము, అణువులు, ద్రవ్యము, ద్రవ్యశక్తి, యివియే భూతకోటి యునికికిఁ గారణములని వైశేషిక మతమునుండి యేర్పడు సారము. ఇదియొక విధమైన నూతన సాంఖ్య మతముగనున్నది.

సాంఖ్యమతము కేవలముగఁ బ్రకృతికే ప్రాధాన్యమిడెను. గౌతమ కాణాదుల న్యాయసిద్ధాంతములలో నాత్మయను నామముఁ జోటనిచ్చినను నాత్మకు నే స్వాతంత్ర్యము నెవ్విధముగను సాధింపలేదు. ఉన్నదనిమాత్రము చెప్పిరి. సామాన్య జనులకు నుపనిషద్వేదాంతములు దురవగాహములయ్యెను. బ్రాహ్మణ ముల కర్మకాండ సాంబంధికాచారాగమములు బహుకష్టము లగుటయగాక బలవ ద్బాధకములయ్యెను. కావున విశేషజనులు నాస్తికులైరి. నాస్తికమతమని యొక మతమే యేర్పడెను. ఈ మతవిషయము సంగ్రహముగ వేదోపన్యాసములలోను భగవద్గీతోపన్యాసములలో నాచే వ్రాయఁబడినవి. ఈ మతము కర్మకాండను బొత్తిగ నిరసించును. పునర్జననము లేదనను. పుణ్యపాపములు నిరాకరించును. ప్రాణమయ కోశములు దప్ప మిగతకోశముల విచారమైనను జేయదు. ఈ మతమువారింద్రియ గోచరములయిన ప్రత్యక్షవిషయములు తప్ప తక్కినవానిని నమ్మరు. సర్వము స్వభావసిద్ధములనియును, దైవము లేదనియును వాదించుచుండిరి. ఇది చైతన్యమతమనియు లోకమతమనియు పేరు. దేహముపదలుటయనిర్వాణ మనియును పిదప నేమియును నుండదు కావున మనుజుఁడు తామనినపుడే యే యుపాయమున నైనను సుఖమనుభవింపఁ బ్రయత్నము సేయవలెనని వీరిసిద్ధాంతము. బృహస్పతి పుత్ర ముఖ్యులగు చార్వాకు లీచార్వాక సిద్ధాంతకర్తలు.

క్రీస్తుశకమునకు నాలుగునూర్ల సంవత్సరములకుమున్ను భరతఖండమున జనులు మతవిషయము నేకములుగాక కన్ను మతము లవలంబించుచుండిరి. వీనికిఁ జేరికగ బ్రాహ్మణములకాలమునుండి తాంత్రికసిద్ధాంతము పేరున శాక్తేయ మతమొకటి యుత్తరదేశంబునఁ బ్రబలియుండెను. ఈ మతవిషయము ముందు నాచే వ్రాయఁబడును. ఇట్టికాలమున గౌతమబుద్ధుఁడను మహానుభావుఁడవతరించెను. ఈ బౌద్ధమతసిద్ధాంత మెట్టులైననుండినను నీ మతమువారి నైతికవిధులుమాత్ర

మతిశ్లాఘనీయములు. శ్రీశంకరాచార్యుల వారిమతములు గ్రహించిరనునది నిజ మైనచో నది యాచార్యులవారి యుదారత్వమును సర్వసమబుద్ధియును దెలుపును గాని వారియశము నకేకళంకమునుగలుగదు. ఆచార్యులవారి బౌద్ధసిద్ధాంతములోని కొన్ని యంశములు ఖండించినారు. కొన్నియంశములను గ్రహించినారు. అందుఁ దప్పేమున్నది! ఈ బౌద్ధమతసిద్ధాంత మేమైనదిన్ని యించుకవ్రాసెద.

ఈ మతమునను సరించి మనుజుఁడు “వివిధవస్తు తత్త్వములయొక్కయు వానిగుణములయొక్కయు సముదాయమని” తెలుపఁబడును. అవియెవ్వియన:—

(1) రూప (2) వేదన (3) సన్న (Abstract ideas)!

సంస్కార (Tendencies of mind) విజ్ఞాన (Mental powers) ఈ వర్గము స్కంధమని పిలువఁబడును. అందురూప మిరువదియెనిమిది గుణములతో నుండునది.

4. మూలతత్వములు. పృథివ్యప్తేజోవాయువులు.

5. జ్ఞానేంద్రియములు:

5. శబ్దస్పర్శరూపరసగంధములు.

2. స్త్రీ పురుషులు.

3. ఆలోచన జీవతేంద్రియము (Vitality) ఆకాశము (Space)

2. అభిప్రాయములు తెలుపుక్రమము. అభినయము మాటలు.

7. ప్రాణియొక్క యేడువిధములగు లక్షణములు. తేలిక, నయము, (Elasticity) ఇమిడిక, బలపడడము, కాలపరిమితము, నాశనము, మార్పు.

వేదన. ఇదియారువిధములు, 5 జ్ఞానేంద్రియమువలన గలుగునవి, 1 మానసము నుండి కలుగునది.

౩. సంజ్ఞ. ఇది యారువిధములు.

4. సంస్కారములు. ఇది యేబదిరెండువిధములు. ఇందులో మానసికసంకల్ప వికల్పములన్నియును వచ్చును.

5. విజ్ఞానము. ఇందులో నాలోచనాది విషయములు వచ్చును.

పై విషయములు మానవశారీర మానసములకుఁ గారణములు. ఇవి సత్యములుకావు. మొదటితత్త్వములలో వచ్చునవి వస్తువికల్పములు మాచువారె నగవతి

నశించును. రెండవవర్గములోఁ జేరిన జ్ఞానేంద్రియ విషయములు నీటిబుగ్గలబలె నశించి మాయమగునవి. మూఁడవవర్గములోఁ జేరిన భావవికారము లెండమావులను బోలినవి. నాల్గవతరగతికిఁ జేరిన మానసిక నైతికద్యోగము లరఁటిపట్టెలబలె డొల్లగనుండునవి. అయిదవ తరగతికిఁ జేరిన యాలోచనాది భావము లైంద్రజాలకుని భూతాకారములను బోలినవి. కావున పైవస్తువులెల్లను మాయలు. భూతకోటి యెప్పుడున్ను మారుచుండును.

ఆత్మయున్నదనిగాని లేదనిగాని, శాశ్వతమనిగాని, యశాశ్వతమనిగాని, గౌతమబుద్ధుఁడెచటను స్పష్టముగఁ దెలుపఁడు. ఆ విషయమున నెవరయినను ప్రశ్నించినచో మౌనము వహించియుండునుగాని బదులిడఁడు. అయితే పునర్జన్మ కర్మబంధములున్నవని పలికినాఁడు. ఆత్మయొక్క శాశ్వతస్థితిని నమ్మనపుడు పునర్జన్మ సిద్ధాంతమెట్లు కలుగుననిన నీవిధముగఁ బలికినాఁడు.

శరీరము పడిపోయినవెంటనె మఱియొక కర్మశరీరము సూక్ష్మముగఁ బుట్టును. అది పుట్టుటకుఁ గారణము తృష్ణ. బ్రతికినపుడు ప్రాణి తనకుఁ గావలయునని యభిలషించు పట్టుదలయొక్క ఫలముతృష్ణ. బాహ్యవస్తు సంయోగమున జ్ఞానేంద్రియములకు సుద్వృత్తికలుగును. ఆ యింద్రియోత్సేకమువలన దానిఫలమను భవింపవలెనను కోరికగలుగును. ఈ కోరికయే తృష్ణ. మానసోద్భవమగు నీకామము మఱియొక సూక్ష్మశరీరమందును. ఇది కర్మమునుండి కలుగునట్టిది. ఈకర్మశరీరము తాను పూర్వమొనరించిన పుణ్యపాపముల వాసనలతోఁగూడి తనకు నవ్యమగు శరీరమయి జనించును కావున నట్టి నూతనప్రాణికిఁ బూర్వజన్మ శారీర మానసగుణ వికారములే వచ్చుచుండును. ఈ దురవగాహమైన రహస్యమే బౌద్ధులసిద్ధాంతము.

బౌద్ధమతమురీతిగ దృశ్యప్రపంచ మశాశ్వతము. చరస్థిరవస్తువులెల్లను మార్పులయి నశించిచచ్చును. దేవతలు మానవులు చచ్చువారేను. ఎద్దియును శాశ్వతముగ నిలువదు. ఇఁక జననక్రమ మెట్టిదనిన:—

అవిద్యనుండి సూత్మాకృతి యేర్పడును. ఆ రూపమునుండి యహంకార మేర్పడును. అహంకారమునుండి నామరూపము లేర్పడును. నామరూపములనుండి జ్ఞానేంద్రియ పంచకమున్ను మానసము నేర్పడును. వానినుండి జ్ఞానేంద్రియములకున్ను వస్తువులకున్ను సంయోగము గలుగును. సంయోగమువలన తెలివికగల్గును. దానికనుండి తృష్ణ లేక యాశగలుగును. ఆ తృష్ణమునఁ ప్రాణమునకై పాశ గలుగును. ఆ యాశచే భావరూప ముద్భవించును. ఆ భావరూపమువలన జననము

కలుగును. జననమువలన ముదిమియు మరణము నిరాశయుఁ గలుగును. ఇవియే భూతకోటి కష్టానుభవ కారణము.

పై విషయమునుబట్టిచూడ మన జననమునకుఁ గారణ మవిద్యయని నట్లాయెను. అవిద్యయనఁనేమి? దీనికి గౌతముని శిష్యుఁడీరీతిఁ బలికెను.

కష్టమెఱుంగమి, కష్టమూల మెఱుంగమి, కష్టనాశన మెఱుంగమి, కష్ట నాశన మార్గమెఱుంగమి. ఈ యెఱుంగమియే యవిద్యయనఁబడును.

గౌతముఁడే యొక్కచోట నీవిధముగ వచించెను.

అవిద్యయనఁగా కర్మమేను. ఒక జన్మములో మనమొనరించిన కర్మఫలములు రెండవజన్మమునకుఁ గారణములు. అవిద్యా నాశనమగునంతవఱకుఁ బునర్జన్మములు మనకుఁదప్పవు. ఆశాపాశములు సంపూర్ణముగఁ దెంచునంతవఱకు నవిద్య నశింపదు. దానినాశనముచే సూత్మాకృతుల తత్వములు నశించును. అవి నశించుటచే నహంకారము నశించును. తన్నాశనముచే నామరూపములు నశించును. దానివలన మానస వికారములు నశించును. దానిచే విషయసంయోగము నిలుచును. తత్కారణంబున విషయజ్ఞానము నశించును. ఆ నాశనముచేఁ దృష్ణ నశించును తన్నాశనమున దేహాభిమానము పోవును. తత్కారణంబున జననము లేకపోవును. జననము లేనపుడు ముదిమియుఁ జావులు నుండవు. దుఃఖముండదు. బాధలుండవు. చింతలుండవు. నిరాశలుండవు. ఇవియే మానవబాధలను నశింపఁ జేయు విధములు.

గౌతముఁడు తన సిద్ధాంతమును కర్మ పునర్జన్మములను రెండు స్తంభములపై నిలిపినట్లాయెను. ఈ సిద్ధాంతములు కొన్నిమార్పులతో బ్రాహ్మణముల సిద్ధాంతములనుండియే గ్రహించెననుటకు సందియములేదు.

తానువిత్తినఫలము తాననుభవించుననురీతిగ దనకర్మఫలమే తనసొత్తనియు తనబాధ్యతయనియు తన జననమూలమనియు నీసిద్ధాంతము చక్కఁగఁ దెలియఁబఱచుచున్నది. ఏలోకమునకున్నను మానవుఁడు కర్మమొనర్పకయుండఁడని తెలియఁజేయుచున్నది. దేహము నశించినను మానససంకల్పములు నశించినను కర్మవాసనలు రూపముగొని యుండునని గౌతములు నిర్ధరించినారు. "ఎద్దియును లేదు అంతయునగును" అను సూత్రమే వీరికిఁ బ్రాధాన్యము. నీవు దేహ మానసికములచేఁ జూచునదంతయును దలఁచునదంతయును మాయమైపోవును. అయిన నీవొనరించు కర్మములయొక్కయు తలఁచు తలంపులయొక్కయు, మాటలాడు మాటల

యొక్కయు ఫలములుమాత్రము సార్వకాలము నిలిచియుండును.

అవిద్యకుఁ జిక్కిన మానవస్థితి పదివిధములైన భ్రమలకు లోఁబడును. అవి యెవ్వియన:—

(1) శారీరభ్రమ, (2) సందేహభ్రమ, (విచికిత్స) (3) కర్మములకు వశుఁడగుట (4) కామవశుఁడగుట (5) క్రోధావేశుఁడగుట (6) భౌమికసౌఖ్యాపేక్ష (7) స్వర్గసౌఖ్యాపేక్ష (8) గర్వము (9) ఉద్ధత (10) అజ్ఞానము. ఈ పదిదుర్గుణములను మానవలెను.

ఇఁక వీనిని మాన్ప ననుసరింపఁదగిన మార్గము లెవ్వియన:—

(1) మంచియుద్దేశము (2) మంచిభావన (3) మంచిమాటలు (4) మంచినడవడిక (5) మంచి జీవనోపాయము (6) మంచిప్రయత్నము (7) మంచిమనస్సు (8) మంచిధ్యానము శాంతి (9) మంచివారితోఁ గూడియుండడము (10) ధర్మవిధుల ననుసరించడము (11) పుణ్యార్జనాభ్యాసము. ఈ రీతిగనుండు వాండర్హతుఁడనియును నట్టివాఁడుమాత్రము నిర్వాణపదవి నందుననియు గౌతముఁడు స్థాపించెను. నిర్వాణమన నేమి? దీపమాఱిపోయినటుల నాఱిపోవడ మా యేమి? ఆఱిపోవడ మెద్ది? ఆత్మలేదనునపు డాఱిపోవున దాత్మకాదుగదా! పాపరూపముగ మానస హృదయములనంటి యాశలు గల్పించునట్టియు తత్కారణంబునఁ గర్మము లొనరింపఁజేసి పునర్జననమునకుఁ గారణమైనట్టియు స్థితియెద్ది గలదో యాస్థితినాశనమే నిర్వాణమనఁబడునని గౌతముని సిద్ధాంతము. దీనినిఁ బట్టిచూడ, నిర్వాణమన నిష్కళంకమగు శాంతస్వభావమని సారమేర్పడును. సంపూర్ణజ్ఞానమును సంపూర్ణశాంతియు సంపూర్ణ సుహృదయమును గలవాఁడే నిర్వాణపదవి నందినవాఁడని తెలియనగును. ఈస్థితి నందుటకు నెంతటి పావనమగు నైతికస్థితి మానవుఁ డవలంబింపవలెనో చదువరు లూహింపనగును. తృష్ణక్లేశోపాదాన స్థితుల నశింపఁజేసినవానికిఁ బునర్జన్మమునకుఁ గారణమేయుండదు గదా? అట్టివాఁడు దేహనాశనమువఱకు నుండిన జీవన్ముక్తుఁ డనియును దేహము వదలినపిదప విదేహముక్తుఁ డనియును హిందూ మతమున నామములున్నవి. దానినే నిర్వాణమను పదమున బౌద్ధులు వాడుచున్నారు. ముఖ్యమగు బ్రహ్మమునుమాత్రము నిరాకరించినారు.

ఇఁక, గౌతమబుద్ధుని నైతిక ధర్మవిధులు మహోత్కృష్టములుగ నున్నవి. ప్రపంచజనులెల్ల శ్రాద్ధధర్మములను తమతమ గ్రంథములలోఁ జేర్చికొన్నారుగాని

యా ధర్మము లెచటనుండి గ్రహించితిమను మూలస్థితిమాత్రము మఱచినారు.

గౌతమబుద్ధుఁడు నిర్వాణపదవి సాధించుటకు యమనియమాద్యష్టాంగ యోగములే సాధనములని స్థాపించినాఁడు. ఆత్మలేని హిందూ వేదాంతమతమే బౌద్ధమతమని చెప్పనగును. హాకిల్సుగారి జడాద్వైతమనినను నననగును. ప్రతిమనుజుఁడు తనజ్ఞానాభివృద్ధిని తానే యార్జింపవలెనని బుద్ధుఁడు బోధించెను. ఈ మహానుభావుని యుపదేశమార్గ మట్టిపథమే యవలంబించియుండును. నిదర్శనముగ నీ క్రింద నొకకథను వ్రాసెద.

ఒకస్త్రీకి బహుదినములకు నొకపుత్రుఁడు గలిగెను. ఏకపుత్రుఁడను కారణంబునఁ దల్లి వాని నతిశయప్రీతిచే రక్షించుచుండెను. విధివశమున నాబిడ్డఁడు మృత్యువువాతఁ బడెను. తల్లి పట్టఁజాలని దుఃఖముచే నా శిశువు నెత్తికొని బుద్ధుని శిష్యునివద్దకుఁ గొనిపోయి మహాత్మా! ఈ బిడ్డఁడు బ్రదుకునట్టి మందిమ్మని యడిగెను. ఆ మహాత్ముఁడు జాలినంది అమ్మా! చచ్చినవానిని బ్రదికించుమందు నావద్ద లేదు. అట్టి మందిచ్చువానినిమాత్రము నాకుఁ దెలియునని చెప్పెను. అతఁడెవఁడని యాముగ్ధ బతిమాలి ప్రార్థింప నా మహాత్ముఁడు గౌతమబుద్ధుని నామము నుడివెను. అపుడా నారీమణి శవమును నెత్తికొని బుద్ధుని సరసకుఁజని తనపుత్రుని బ్రదికింపుమని వేడికొనెను. బుద్ధుఁడా స్త్రీ ముగ్ధత్వముఁజూచి యామె దుఃఖమును బోకార్ప నొకయుపాయంబుదోఁచి యామె కిట్లులనియెను. "ఈ గ్రామమున నెవరింటనైన నొక యావగింజనడిగి తీసికొనిరమ్మ. అయిన నట్టివారి యింటిలో నెవరు నెపుడును జచ్చియుండఁగూడదుసుమా యని యానతిచ్చెను. ఆ ముగ్ధస్త్రీ మృతబాలకు నెత్తికొని యింటికినిఁబోయి తనదుఃఖోదంతంబుఁ జెప్పికొని యావగింజ యాచించెను. ప్రతిగృహములో నెందఱో పుట్టిచచ్చినారని చెప్పుచువచ్చిరి. ఆ ముగ్ధ స్త్రీ యా మాటలెల్ల వినినతోడనె తెలివివచ్చి పుట్టినవారందఱును జచ్చుట సహజమేయని యాఱడిల్లిఁ బాలుని శవసంస్కారమొనర్చి బౌద్ధయోగినియయ్యెను. ఇట్టి యనుభవోపదేశము బుద్ధుఁడు చేయుచుండెను.

బౌద్ధమతము స్వాతంత్ర్యమును సమత్వమును భ్రాతృభావమును బోధించు నైతికమతమనుటకు సందేహములేదు. ఈ మతమున జాతిభేదములేదు. శ్రౌతస్మార్తకర్మలులేవు. ఈ మతమున నాత్మలేదనువాద మెట్టులయినఁబోనిమ్ము. అజ్ఞానమునుండి జ్ఞానోదయ మెట్టులగును. అజ్ఞానస్వరూపమున జనించిన మనుజుఁడు శుద్ధబుద్ధము క్షణభావ మెట్లుండుననుటకు హేతువులు చూపబడలేదు. పుట్టిముద్ద

నెంతగాఁగడిగినను నెంతగాఁ గాల్చినను వన్నె హెచ్చునుగాని ముక్తిస్వభావము పోవునా? తనమతమున నాత్మను దెచ్చియుంచినచో నావిషయము జనసామాన్యమునకు బోధించుట కష్టతమమగుపని యగుననియు జనులకది దురవగాహ విషయమగుననియు తలంచి బుద్ధుని యావిషయంబున మౌనమూని ప్రకారాంతముగ నాత్మవిషయమునే బోధించినాఁడని నాకుఁదోఁచెడు.

బుద్ధుని జీవితకాలమున స్తుతులుగాని ప్రార్థనలుగాని పూజలుగాని, యాగమాది కర్మాచరణములుగాని యుత్సవములుగాని యెవ్వియునుండలేదు. బుద్ధునకు వీనియందే విశ్వాసముండలేదు. తన్నుఁదాను శుద్ధిపఱచికొని తనంతకుఁదానే యభివృద్ధి నందవలెనుగాని బాహ్యకర్మములనుండి యేమియుఁ బ్రయోజనము లేదని యతనిసిద్ధాంతము. అతఁడుసిద్ధినందినపిదప నతఁడేమఱ్ఱిచెట్టుక్రింద వసించియుండెనో యాచెట్టు పూజ్యార్హమై పుణ్యక్షేత్రమాయెను. వెయ్యాఱుజనులు దిగ్దేశములనుండి గయకువచ్చి యావృక్షమును బత్రపుష్పఫలాదులచేఁ బూజించుచుండిరి. తత్కారణంబున గయపుణ్యక్షేత్రమయి గొప్పపట్టణమాయెను. ఆ బుద్ధునియెముకలు దంతములు పదిచోట్లఁ బూడ్చఁబడి బృందావనములు గట్టఁబడెను. వానిపేరు దాగోబాలు. ఈ దాగోబాలున్నస్థలములుగూడ పుణ్యక్షేత్రములయ్యెను. కొన్నిదినములలోనే బుద్ధుఁడు దైవమని తలంపఁబడెను. అతనివిగ్రహములు దైవములై పూజింపఁబడసాగెను. ఆ విగ్రహములకు నాలయములు గట్టఁబడెను. తనమతములోనే దైవములేదనిన వానిచే వానిశిష్యులు దైవముగనొనర్చి పూజింపసాగిరి. ఇంతయకాదు. అతని శిష్యులుసైతము దైవములైరి. ఊహలపైన దైవములనుగల్పించి పూజింపసాగిరి. వానికిని దేవాలయములుగట్టించిరి. ఈవిధముగ బౌద్ధమతము విగ్రహారాధనమతమయ్యెను. ఆగమాచరణము లోకరీతిగ మఱలఁ దలయెత్తెను.

బుద్ధునియనంతరము బ్రాహ్మణులనేకులు బౌద్ధమతములోఁ జేరి యామతభాషయగు పాలీనివదలి సంస్కృతమయమునుజేసిరి. కావున నుత్తరదేశమునందలి బౌద్ధగ్రంథములు సంస్కృతభాషలో వ్రాయుటకుఁ గారణమాయెను. ఈ బౌద్ధులమతము, చార్వాకుల మతమువంటిదికాదు. కొన్ని మార్పులతోఁగూడిన వేదాంతమతమేను. ఈ బౌద్ధమతమునుండి బ్రాహ్మణ మతములో మార్పులనేకములుగలిగెను. వేదాంతమతము పురాణమతమయ్యెను. పురాణమతమునకు మూలము, చెడిన బౌద్ధమతమేను.

బుద్ధుఁడు [illegible] రెండువందల సంవత్సరములలోనే యామతము

జెడి విగ్రహారాధనలు, బలములు దాగోబాలు, వృక్షములపూజలు హెచ్చుపెఱిగి యుండెను. దీనికిఁ జేరికగ బ్రాహ్మణములకాలమునుండియు నథర్వణవేద జనితమగు శాక్తేయమత మొక్కటి వృద్ధినంది పురాణయుగకాలమునకు మిగతమతములవలెనే చెదుఁదారులు ద్రొక్కియుండెను. ఆ శాక్తేయ మతవృద్ధిక్షీణతల [illegible].

హిందూమతములో బహుకాలమునుండి యతిశయముగ వృద్ధినంది యుండిన మతము శాక్తేయమతమేను. ప్రపంచమునంతయును దనగర్భముననుంచికొని చరాచరకోటిని జనింపఁజేసి వానిరక్షణార్థ మర్హములగు వస్తువులిచ్చి మనుచుచుండు తల్లి "భూశక్తి" గదా? అట్టి ప్రేమాస్పదురాలును, మనోహరురాలును నగు మాత భూమాతయేయని యెన్నఁబడియుండెను. ఆ మాతయే ప్రాణమనియు నాత్మయనియు సర్వశక్తియనియు నాద్యంతములనియు పూజింపఁబడసాగెను. ఆ శక్తికే భవాని పార్వతి కాళియని యనేకనామములిడఁబడెను. ఈ మతమున శ్రద్ధాభక్తులే ప్రాధాన్యములు "శక్తి" యననేమి? అది యెచ్చటనుండి పుట్టెను? అని ప్రశ్నింప నది ఋగ్వేదకాలమందే పుట్టినదని పలికిరి. అది యెట్లనిన నీరీతిగ సమాధానమిచ్చిరి.

ఋగ్వేద దశమమండలములోని 129.వ సూక్తమున్నది. ఆ సూక్తములోని 1-2 ఋక్కులలో సృష్టికిమున్ను నొక్కటియే యుండెననియు నా యొక్క తత్త్వములోనుండి "యిచ్ఛాశక్తి" పుట్టెననియు నా యిచ్ఛాశక్తియే వ్యక్తస్వరూపములగు ప్రపంచాది వస్తుతత్త్వములకుఁ గారణమనియు తెలుపఁబడినది కదా? ఈ యిచ్ఛాశక్తి "కామస్తదగ్రా" మొదటఁబుట్టెనని ఋగ్వేదములో పలుకఁబడినది. అనఁగా ప్రారంభమున బ్రహ్మమొక్కటి యుండెననియు నది యవ్యక్తముగ నుండినందున నెవరు నేరూపముగ నేవిధముగను నూహింపలేక యుండిరనియు పిదప నా బ్రహ్మమునందు గామమను శక్తి యుద్భవించెననియు ఋక్కులలోఁ బలుకుచు నేదైవమును నిపుడారాధింపవలెనని యడిగినాడు కావున "శక్తి"ని యనియే యుత్తరమియ్యఁదగినదిగ నున్నదని యెన్ని యనేకులా శక్తి "భూమాత" యన్నినమ్మి యనేకనామముల నా దేవతను బూజింపసాగిరి. బ్రహ్మమవ్యక్తము. అయిన వానియిచ్ఛ లేక శక్తి లేక ప్రకృతి యగపడినపుడు బ్రహ్మము తెల్లియునాయెను. ప్రపంచమును దగపడెను. ప్రకృతితోఁగూడిన పురుషుఁడగపడెను. జనులప్పుడు బ్రహ్మములోనుండిన శక్తి దేవతలనుజూచి పూజింపసాగిరి. ఋగ్యజుస్సామవేదములందుండు ఋక్కులు యజ్ఞయాగాది కర్మములందుపయుక్తములుగ

నుండినందున వ్యాసులవారు విభజించిరనియు మిగతఋక్కులు సుఖసంపాదనకున్ను ద్రవ్యార్జనకున్ను శత్రుసంహారమునకున్ను వశసిద్ధులకున్ను నుపయుక్తములుగ నుండినందున నవినైహికములని వ్యాసులు గూర్చినందున యథర్వణఋషి వానినెల్ల గూర్చినందున యథర్వవేద మేర్పడెననియు యా వేదమునకుఁ జేరినదే యీ శాక్తేయ సిద్ధాంతమనియు పలికిరి. అనఁగా ఋగ్యజుస్సామము వైహిక పారమార్థికములు రెంటికి నుపయుక్తములైనవనియు యథర్వవేద మైహికప్రయోజనము మాత్రము కలదియనియు నేర్పడెను. వశ్యావిద్యలకున్ను నైంద్రజాలములకున్ను మారణవిద్యలకున్ను రసవాదములకున్ను వైద్యచికిత్సలకున్ను నథర్వవేదము మాతృస్థానమయ్యెను. ఆగమకర్మములెటు మోక్షసాధనములో యారీతిగనే యీ యథర్వవేద తంత్రము లణిమాది శక్తులిచ్చునవని యేర్పడెను. త్రయీవిద్యలకు యోగాభ్యాస మేర్పడెను. అథర్వవిద్యకు తాంత్రికసాధన లేర్పడెను. బుద్ధుని యనంతరము నందీతాంత్రిక సాధనాభ్యాస మామతములో బలముగఁజొచ్చెను. తాంత్రికసాధనలలో శక్తి ముఖ్యదేవతయాయెను. వేదాగమాచరణల వలెనే తాంత్రికసాధనలందును మద్యమాంస సేవన బలమాయెను. పశుహింసలు హెచ్చాయెను. ఈ శాక్తేయమతమునకు శక్తి ఋగ్వేదమునుండి వచ్చెను. తాంత్రికసాధనము లథర్వవేదమునుండి వచ్చెను. పశుహింస బ్రాహ్మణములనుండి వచ్చెను. సిద్ధాంతము వేదాంతమునుండి వచ్చెను. ఈ తాంత్రికవిద్య యధ్యాత్మజ్ఞానమునకు మంచివారికి సాధనమాయెను. దుర్మార్గుల పాపకృత్యములకు మార్గముఁజూపెను.

తాంత్రికసాధనములు యోగసాధనములకంటెను హెచ్చుగ నేర్పడెను. నిదర్శనముగ నొక్కవిషయ మిచటవ్రాసెద.

“ మనదేహమున నాడీచక్ర మొకటి యున్నది. నాభీప్రదేశము లోభాగమున నొకకోశము గొట్టమువలె నున్నది. అచటనుండి పైరువలె ననేకములగు నరములు మొలకలెత్తుచున్నవి. 72000 వేల నరములని పెద్దలు లెక్కిడినారు. అవి యన్నియును నూర్ధ్వముఖములై యుండును. చక్రమువలె గుండ్రముగనుండును. అసంఖ్యాకములగు నై నరములలోఁ బదిమాత్రము ముఖ్యములైనవి. (1) ఇడా (2) పింగళ (3) సుషుమ్న (4) గాంధారి (5) హస్తిగిహ్వ (6) పృథ (7) జోష (8) అలంబస (9) హూహూ (10) శంఖినిః—ఇవి ముఖ్యప్రాణములని వర్ణింపఁబడినవి. ఈ పది ముఖ్యప్రాణములున్ను మరలఁ బదివిధములుగ విభజింపఁబడినవి. (1) ప్రాణ (2) అపాన (3) సమాన (4) ఉదాన (5) వ్యాన (6) నాగ (7) కూర్మ (8) కృకర (9) దేవదత్త (10) ధనంజయ.

వీనిలోఁ బ్రాణమనునది ముఖ్యమైనది. ఇదియే సర్వప్రాణములకు నాధారముగ నుండునది. దీనికి శ్వాసోచ్ఛ్వాసములు గలిగించు శక్తిగలదు. మలమును వెలివేయునది యపానప్రాణము. వాతపిత్త శ్లేష్మములను సమస్థితి నుంచునది సమానప్రాణము. దేహమునకు ననేకములగు చలనములు గలిగించునది యుదానప్రాణము. దేహోత్పత్తికిని దేహవ్యాధికినిఁ గారణము వ్యానము. ఆవలింతలు గలిగించునది నాగము. నోరు తెరపించునది కూర్మము. అన్నము తిననిచ్చునది కృకరము. దేహవస్తుతత్వములోఁ జేరినది ధనంజయము. త్రేపులు దేవదత్తమునుండి కలుగును. మరణమందినను ధనంజయవాయువు నిలిచియుండును. ఇవి మరలఁ బది విధములుగ విభజింపఁబడినవి:

(1) ఉన. ఎక్కిళ్లు గలిగించునవి (2) అధిమాస. ఆవలింతలు గలిగించునవి. (3) రీన. దగ్గుపుట్టించునది (4) ధన. ఊపిరిపుట్టించునది. [నడుమ విసుభము] (5) కుడిభాగము. ఉత్తరము. (6) ఎడమభాగము, దక్షిణము. శరీరమధ్యభాగము సుషుమ్న (7) ఎడమ ఇడ (8) కుడి. పింగళ. దానిపైభాగము ప్రాణము. ఆది. (9) దినము (10) రాత్రి. అపానము. ప్రాణవాయువు లీరీతి పదిభాగములలో నర్చిరి. ఈ పదివాయువులను వశపఱచుకొను సాధనము ప్రాణాయామ నియమము. దీని నుండి యూపిరి దేహములోనికిఁ బీల్చుట పూరకము. ఊపిరి బిగపట్టుట కుంభకము. ఈ వాయువులన్నియు నూర్ధ్వముఖములుగఁ జేసినచో శివదర్శనమగునని శాక్తేయుల సిద్ధాంతము. తాంత్రిక సాధనములు యోగసాధనములేను. మంత్రము లథర్వవేదములోనివి. వీనిని సాధించినవానికి స్తంభన, మోహన, వశీకరణ, విద్వేషణ, ఉచ్చాటన, మారణ, శాంతి మహిమలువచ్చునని తెలుపఁబడినది. ఇవి యెటు లాచరింపఁదగినవి వివరింపఁబడినవి. శాక్తేయమతములో నాగమ కర్మములున్నవి గాని నిగమాచరణములు విశేషముగ లేవు. ఈ మతమువారు రాత్మను నమ్మరు. యోగమును సాధింతురు. అయిన నన్నిసాధనలును ప్రాపంచిక సుఖమునకే చేయుచుందురు. సరియయిన మార్గములో నుండువరకు నీమతమొక్కవిధముగ మంచిదిగానేయుండెను. ఎపుడు పంచతత్వసాధనము మతములోఁ బ్రవేశించెనో యప్పటినుండియు మతము చెడెను. క్రూరకృత్యములు బలమాయెను. నీతిబాహ్యమయ్యెను. వావివరుసలు లేకపోయెను. మద్యమాంస సేవనలు హెచ్చాయెను. ఈ మతమునకు నత్యంతమగు కళంకము గలిగెను. నీతిమార్గమునే మతాధారముగ నుంచిన బౌద్ధులు కొందఱీమతము నవలంబించిరి.

అట్టికాలంబున హిందూ పురాణమతము ప్రారంభమాయెను. అదియు నేకముఖముగా నొకదానికి మఱియొకటి విరుద్ధమగుచు జనులను సందేహ సముద్రములో ముంచెను. కొందఱు కన్నదైవములను బూజింపసాగిరి. కొందఱు తమ దైవమే గొప్పని కల్పింపసాగిరి. మఱికొందఱు దైవమే లేదనిరి. బౌద్ధులనుం జూచి బుద్ధునకుం బ్రత్యామ్నాయముగ రామ కృష్ణావతారములను గల్పించిరి. బుద్ధునివృక్షమునకు మాఱుగ మఱ్ఱిచెట్టును తులసీవృక్షములను బూజింపసాగిరి. బౌద్ధుల చైత్యాలయములకు మాఱుగ దేవాలయములు నిర్మించిరి. ఇవి పురాణమునుండి కలిగినది. శ్రీ శంకరాచార్యుల కాలమునాటికి భరతఖండములో నుండిన ముఖ్యమతము లీక్రింద వ్రాయఁబడినవి. వాని నెల్ల సంపూర్ణముగనో కొన్నిభాగములో ఖండించుట కష్టతమమగుపని వారికైఁబడెను.

[1] పురాతన వేదమతము [2] అథర్వరహస్యమతము [3] బ్రాహ్మణములమతము [4] ఉపనిషన్మతము [5] సాంఖ్యమతము [6] వేదాంతమతము [7] యోగమతము [8] జైనమతము [9] బౌద్ధమతము [10] నాస్తికమతము [11] తాంత్రికమతము [12] పురాణమతము. మఱియుఁ జిల్లరమతము లనేకములు.

ఇన్నిమతములను బొత్తిగ ఖండింపకయున్నను సంస్కరించి యేమత మునకును విశేషముగ విరుద్ధముగానటుల మత మేకముఖమగులా గొనర్చినవారు శ్రీ శంకరాచార్యులవారే. మహనీయులగు శ్రీ శంకరాచార్యులవారి కాలనిర్ణయమునుగుఱించి నేను ప్రత్యేకముగ వ్రాయఁబూనితిని గావున నిచ్చట వ్రాయలేదు. వారి చరిత్రమైనను, వారిమతమును వివరించునపుడు వ్రాయఁబూనెద. వీరు మతములనెల్ల నేకముగా నొనర్చుటకు సిద్ధాంత మొనర్చినవారు. కావున వీరి సిద్ధాంతములెంతవఱకో యీయుగ లోపమునొందినను నది యొక గొప్పతప్పని వారిని నిందింపరాదు. వారి సిద్ధాంతము భరతఖండములో సమస్త జనాదరణీయముగ నున్నది. ఇప్పటికిని వారిసిద్ధాంతమే యొక భరతఖండమేగాదు యూరోపు అమెరికాలకైనను వ్యాపించి సర్వులకు నధ్యాత్మజ్ఞాన మొసంగినది. నాస్తికవనకుఠార మైనదిం తిరముత సిద్ధాంతములకు మార్గదర్శకమైనది. జనులలో నైకమత్యమును గలిగించినది. ఈ మతము లోకసామాన్యము. తెలిసికొను వంటటి సులభసాధ్యము కాదు. జనులు సులభగ్రాహ్యమగు సిద్ధాంతము లోపరుచుట వలనైన శ్రీ శంకరాచార్యులవారు సన్యాసమునకే ప్రాధాన్యమునిచ్చి కర్మము నిరాకరించినారని కొందఱు తలంచినారు. జనులందఱును సన్యాసులైనచో ప్రపంచవ్యవహారము నిలిచిపోవునని వాదించుచున్నారు. ఇది యెంతటితప్పో ప్రాజ్ఞ

లూహింతురుగాత. సన్యాసము స్వీకరించునంతటి యోగ్యత సాధించువారు ప్రపంచంబున నెందఱుగలరు? అందఱును దైవవశమున సన్యాసులైరేని బ్రహ్మ సృష్టికింగల్గదా? ఇంకఁ బుట్టించునే తు కాయులబలె నందఱును సన్యాసులైనచోఁ గర్మయేల? ప్రపంచమేల? ఇంతకును సన్యాసత్వము బ్రాహ్మణులకేగదా విధింపఁ బడినది. ప్రపంచవ్యవహారములకు నితరజాతివారు లేరా? శ్రౌతస్మార్త కర్మములు వలదని, బౌద్ధులబలె, వీరేమయినఁ బలికిరియా? ఈ మహనీయుల సిద్ధాంత సూత్రమెఱుంగనివారే యీతప్పభిప్రాయమునకుఁ గారణము. వీరల్పాయుష్కులై సిద్ధాంతమంతకయింకను ముప్పది వత్సరంబులు బ్రదికియుండిరేని తమ సిద్ధాంత మెల్లరకు బోధపడునట్లుగా స్పష్టముగ వివరించుచుండిరి. అధ్యాత్మజ్ఞానమునుగుఱించి వ్యావహారిక భాషలో వారు వ్రాసినదానికంటెను హెచ్చుగ వ్రాయసాధ్యముకాదు. వారొనరించిన మాయావాదము వారు నూతనముగం దెచ్చియుంచిన వాదముకాదు. వేదములోనేమి ఉపనిషత్తులలోనేమి బ్రహ్మసూత్రములలోనేమి వచించిన దానినే విస్తరించి పలికిరి.

మాయావాదమునుగుఱించి కొంతవఱకు నిదివఱలోఁ దెలుపఁబడినది. నే నచ్చోట వ్రాసినరీతిగ సచ్చిదానందస్వరూపమున నుండునదియే 'పరబ్రహ్మము'. రూపరహితము. మనకగపడు లోకములెవ్వియును లేనికాలమున అనఁగా సృష్టికి మున్ను పరబ్రహ్మము యొక్క ప్రభ (Divine power) యంతటను వ్యాపించి యుండెను. అట్టికాలమున మనకిప్పు డగపడునట్టి వస్తుతత్త్వములేగాని కాల దేశములేగాని యెవ్వియు నగపడుచుండలేదు. ఇపుడు మనకగపడు సర్వ తత్త్వముల స్వాత్మలను బీజముల సముదాయము త్రిగుణాత్మకమై యవ్యక్తమై బ్రహ్మములో నడఁగియుండెను. అది బ్రహ్మమునుండి భిన్నమునిగాని బ్రహ్మమేయని గాని యేర్పఱచుటకు మార్గముండలేదు. సర్వము నైక్యమై యవ్యక్తముగనుండెను. త్రిగుణాత్మక తత్త్వబీజాంతర్గతావ్యక్తమగు మూలతత్త్వమే మాయయని శబ్దప్రవర్తించ మేర్పడినపిదప నామమువచ్చెను. కాలదేశముల విభజనగాని భావనగాని లేనప్పుడు మాయ యెప్పుడు ఎచటనుండి వచ్చెనను టకు మార్గము లేదుగదా. కావుననే మాయ యనాదియని పిలువఁబడును. పరబ్రహ్మము సర్వవ్యాపకముగాన దానికి వేఱొక చోటనుండి వచ్చుటకు? ఇఁక మాయయన్నదో [illegible]కమైనది. అది సత్త్వరజస్తమో గుణములు సమానస్థితిలో నైక్యముగ నుండి [illegible] యుండెను. ఆ గుణముల స్వాభావికములు [illegible] కలిగినప్పుడు మాయ వ్యక్తమయ్యెను. ప్రారంభమున వ్యక్తమైనది సత్త్వగుణము. ఆ సత్త్వ

సుగుణాంతర్గతమగు బ్రహ్మమును శబలబ్రహ్మము లేక ఈశ్వరుఁడని మానవులు నామ మిచ్చినారు. సృష్టికిఁ బ్రారంభదశయిది. మాయాగుణములకుఁ జలనశక్తి, లేక క్రియాశక్తి యెట్లు కలిగెనని యడుగవగును. అది వాని స్వభావమని చెప్పవలసినది తప్ప వేఱుమార్గముఁ గానఁబడదు. అట్టులైన మాయాచ్ఛాదితములైన త్రిగుణములే నా సృష్టికిఁ గారణములని ప్రశ్నించవచ్చును. అటు చెప్పనగును గాని పరబ్రహ్మ ప్రభ లేక త్రిగుణాత్మక మాయకు సృష్టిశక్తి రాదని పలుకఁబడును. చలనమువలన సామ్యావస్థలోనున్న త్రిగుణములకు భిన్నత గలిగెను గాని పరబ్రహ్మమునందే భిన్నతయుఁ గలుగదు. "ఏకమేవాద్వితీయ" మను వాక్యమెప్పుడును సార్థకముగ నుండును. చలనమున గుణములు వేఱయినపుడు, గుణములు పరబ్రహ్మములోఁ గదలినను నటు కదలిన గుణములకు సర్వవ్యాపకమైన పరబ్రహ్మ స్వరూపమే యాధారమాయెను. వేఱగుటవలన వ్యక్తమైనది త్రిగుణాత్మక మాయగాని పరబ్రహ్మము కాదనుట స్పష్టము. ప్రథమవ్యక్తమగు మాయను, సాధ్యమయినచో, జ్ఞానాంజనమున వదల్చినచో నిలుచునది పరబ్రహ్మమేను. గనుక "ఏకమేవాద్వితీయ" మనునుడి సార్థకమేను. మఱలఁ జలనములో సత్వరజస్తమోగుణము లొక్కొక్కటిగానో యన్నియును హెచ్చుతగ్గులుగాఁ గూడియో వ్యక్తమయ్యెను. అపుడును సర్వవ్యాపకమైన బ్రహ్మమే దానికి నాధారమాయెను ఆ, వ్యక్తస్వరూపమునకు "నాత్మ" లేక "జీవుఁ" డని పిదప నామము కలిగెను. పిదప సాంఖ్యులు పలికినరీతిగఁ బంచతన్మాత్రలును పంచజ్ఞానేంద్రియములును పంచకర్మేంద్రియములును, పంచమహాభూతములును, వానిగుణశక్తులును, మనస్సను నంతరింద్రియమును గలిగెను. అయిన వారుపలికినరీతిగ పురుషుఁడు లేక యీ సృష్టి కలిగెననుట వేదాంతులొప్పరు. సర్వతత్వములకు మూలస్థానము పరబ్రహ్మమనియే వారునిర్ధరించి "ఏకమేవాద్వితీయ" మనిరి. ఇది సృష్టిక్రమము. ఇఁక వ్యక్తవస్తు గుణలయము నుండి వస్తులయమగును గాని పరబ్రహ్మము శాశ్వతముగ నిలిచియుండును. అనఁగా భూతత్వము జలములోను జలతత్వ మగ్నిలోను నగ్నితత్వము వాయువులోను వాయుతత్వ మాకాశములోను నాకాశతత్వము మనములోను మనోతత్వ మాత్మలోను నాత్మ పరమాత్మలోను గలయును గాని వీనిలోనుండు బ్రహ్మ మేకవిధముగనే చలనము లేక శాశ్వతముగ నిలిచియేయుండును. వ్యక్తద్రవ్యములన్నియును రూపుమాయుచు నశించుచుండును గాని బ్రహ్మమువలె సత్యముగ నుండునవి కావని దానికి వ్యతిరేక శబ్దము మిథ్యయని యుపయోగించినారు. మిథ్యయనఁగా నాశవిపాకము వంధ్యాపుత్రుఁడనిపరీతి శశవిషాణపదార్థముగాదు. "బ్రహ్మసత్యం జగన్మిథ్య"

యను వాక్యార్థ మిదియేను. లోకానుభవము శాస్త్రప్రావీణ్యము తపోశక్తిగల జ్ఞానులు ప్రత్యక్షముగఁ దమకండ్లయెదుటనుండు జగత్తును సర్వాబద్ధమనునంతటివెఱ్ఱివారు కారు. ఇదియంతయును మాయాసృష్టిలోఁ జేరినది కావునను "మాయ" యసత్యము కావునను, జగత్తుమిథ్యయని జ్ఞానులనిరి. "బ్రహ్మసృష్టి" యని పలుమారు శాస్త్రములలో వచ్చుచుండును గదా. అదియేమియని యడుగవగును. మాయాసృష్టిలోనంతయును బ్రహ్మము నిండియుండును గావున బ్రహ్మములేనిదే జగత్తు పుట్టనందునను నేవస్తువును బ్రహ్మములేనిది యుండుటకు సాధ్యము కాదు కావునను సర్వము బ్రహ్మసృష్టియని పేరిడినారు. సృష్టికి బ్రహ్మము నిమిత్తకారణమాయెను. మాయ యుపాదానకారణమాయెను. మాయాసృష్టియొక్క వేళలోనే యొక్క పెట్టున వచ్చినది కాదు. ప్రతినిమిషమునను నీమాయా సృష్టిలయకార్యములు జరుగుచుండును. అవి మానవదృగ్గోచరములు గావు. మాయలో నిపుడు మన కగపడువస్తువుల సూక్ష్మబీజములును వానిగుణములును సుఖదుఃఖాది వాసనలున్ను జ్ఞానాజ్ఞానాది లక్షణములును చేరియున్నవి. మంచివన్నియును సత్త్వమునకు చేరినవి. చెడుగులన్నియును రజస్తమోగుణములకుఁ జేరినవి. ఈ రజస్తమోగుణముల నడచి సత్త్వగుణాభివృద్ధిఁ జేయుక్రమము పతంజలియోగశాస్త్రమున విస్తరించి పలుకఁబడినది. సత్త్వగుణాభివృద్ధిచే నజ్ఞానము, లేక, యవిద్య నశించును. సూర్యకిరణమహిమచే నంధకార మెట్టులయమగునో యటులనే జ్ఞానవిశేషమున నజ్ఞానమునశించును. ఒకవేళ రజస్తమోగుణముల యభివృద్ధికతంబున నజ్ఞానము హెచ్చయినచో సత్వగుణము తగ్గి జ్ఞానమడఁగిపోవును. జ్ఞానము హెచ్చయిన కొలఁదిని క్రమక్రమముగ నున్నత లోకప్రాప్తియగును. ఉన్నతలోకము లెవ్వియన [1] భూలోకము [2] భువర్లోకము [3] స్వర్లోకము [4] మహర్లోకము, జనలోకము, తపోలోకము, సత్యలోకము, ఇవి యన్నియును, జ్ఞానముయొక్క క్రమక్రమోన్నతదశలు. తపోలోకమునకు జీవి సూక్ష్మరూపమునఁ బోవువఱకు గుణలేశముల వాసనలుండును. ఆ వాసనలు పోయినపిదప సర్వవాసనలు లయమయి బ్రహ్మమయినకతంబున బ్రహ్మములో లీనమగును. దీనికే లోకమందురు. లోకమనఁగా మనభూమివంటి భూమియని కాదు. అది తత్వములో జేరిన సూక్ష్మము. ఇఁక సత్వమునకుఁగి రజస్తమోగుణములు ప్రబలించినపుడు జీవి "అతల, వితల, సుతల, తలాతల, మహాతల, పాతాళ లోకములఁ జేరును. ఈ లోకములలో నీచస్థితినను సత్త్వమించుక తలయెత్తినచో నున్నతదశకుఁ జేరును. కాపురంబడినవానికి ముక్తిలేదనునది యీ మతమొప్పదు.

... సాంఖ్యులు పురుషుని జడునిఁజేసి చూచుచుండునట్టుల యొకచోటఁ ... బెట్టక ప్రధానములోఁ జేర్చి ప్రధాన సృష్టికంతయును పురుషసాన్నిధ్యమే ముఖ్యమనియు ప్రధానసృష్టి వస్తువులలో నెల్ల పురుషతత్త్వముండుననియు తెలిపి యుంచిన యెడల వారిదియు మాయావాదమే యగుచుండెను.

మాయావాదమున్నందు సృష్టికి పరబ్రహ్మము నిమిత్తకారణమనియు మాయ యుపాదానకారణమనియు మున్ను తెలుపఁబడినది. అయిన బ్రహ్మమును వదలి మాయ యుండదు కావున బ్రహ్మ ముపాదానకారణమగునని సైతము చెప్పనగును. శారీరకసూత్రములోఁ బ్రహ్మ ముపాదాన నిమిత్తకారణములు రెండునగునని వచింపఁబడినది.

పంచతన్మాత్రల పంచీకరణములవలన పృథివ్యప్తేజోవాయు రాకాశములును బద్ధునాలుగు లోకములును, బ్రహ్మాండములోఁగల జరాయుజాండజోద్భిజ్జ స్వేదజములు కలుగుననియు తెలుపఁబడినది.

మాయావాద సారము "ఏకమేవాద్వితీయం" అను వాక్యమును స్థిరపఱచి "బ్రహ్మసత్యం జగన్మిథ్య జీవబ్రహ్మైవనాపరః" యను సిద్ధాంతమును సాధించుచున్నది. అనఁగా బ్రహ్మమొక్కటియే. దానికి భిన్నమయిన వస్తువెద్దియును లేదు. బ్రహ్మము సత్యము. జగత్తు మిథ్య. జీవాత్మ పరబ్రహ్మమేను వేఱుకాదు. పై వాక్యమున జీవుఁడు పరమాత్మయేగాని వేఱుకాదని తెలుపఁబడినది. ఈ విషయమును తెలుపవలసినదిగ నున్నది. బ్రహ్మమునందు "విజాతీయ స్వజాతీయ స్వగత భేదము లేవియును లేవను వాదమొకటి బహుకాలమునుండి యున్నది. స్వజాతీయ విజాతీయభేదములు లేవుగాని స్వగతభేదమున్నదని యొకవాదముండినది."

(1) విజాతీయ భేదమనఁగా బ్రహ్మమునకును ప్రకృతికిని, వస్తువుకును మనస్సునకును భేదము.

(2) స్వజాతీయభేదమనఁగా - జీవాత్మ పరమాత్మలకు భేదము.

(3) స్వగతభేదమనఁగా - బ్రహ్మములో నే భేదము స్వచ్ఛముగ ... [illegible] ... పరబ్రహ్మతత్త్వమున్నదని యొకవాదము. ప్రకృతితోఁ ... [illegible] ... పరమాత్మ యొక్క యొకవిధమగు స్థితియనియు పర ... మాత్మలో ... [illegible] ... భేదము ... యుండుననియు నొక వాదము.

సైన వ్రాయఁబడిన మూఁడు తరగతులలోను భేదములేదు. పారమార్థిక దృష్టినిఁగనిన సర్వము నొక్కటేయనువారు విశుద్ధులేక నిర్విశేషాద్వైత వాదులైరి. మొదటి రెండుతరగతులలో నేకమైనను మూఁడవతరగతిలో నేకత్వమునకు నించుక న్యూనతఁగలదనువారు విశిష్టవాదులైరి. మొదటివారద్వైతులు, రెండవవారు విశిష్టాద్వైతులైరి. ఈ రెండువాదములను బలపఱచుటకు బ్రహ్మసూత్రములేమి యుపనిషత్తులేమి ప్రమాణములుగనున్నవి. మొదటివాదము మాయావాదము. రెండవవాదము పరిణామవాదము. ఈ వాదములు రెండును ఋగ్వేదకాలమునుండియుండినను జనులావాదములంతగఁ బాటింపరైరి. శ్రీశంకరాచార్యులవారు మాయావాదము ననుసరించి భాష్యములు వ్రాసినందున వారికి మాయావాదులని నామమువచ్చెను. శ్రీరామానుజాచార్యులవారు బోధాయనుల భాష్యమునుఁబట్టి పరిణామవాదమును స్థాపించు భాష్యమొనర్చిరి. కావున వారికిఁ బరిణామవాదులని నామమువచ్చెను. ఈ వాదముల ఫలములే నిర్గుణ సగుణవాదములు. నిర్గుణ సగుణవాదములే మతభేదములకుఁ గారణములు. ఆత్మలేక యాత్మలు పరమాత్మలోకముఁ జేరువఱకు వాదములో ద్వైతాద్వైత విశిష్టాద్వైతములందంట్టి ముఖ్యభేదము లగపడవు. అటఁ జేరినపిదపఁ బరమాత్మలో లీనమా సంయోగమా భిన్నమా యను వాదములు పెఱిగి ద్వేషములు హెచ్చెనుగాని యే యాచార్య పురుషులుగాని యీ వాదములను సముచ్చయింపరైరి. ఈ ద్వేషములు రాజస తామస గుణఫలములుగాని వేఱొకటిగాదు. భగవద్గీతలో మాయా పరిణామ వాదములను సముచ్చయింప యత్నింపఁబడినవిగాని యవి హేతువాదములనుబట్టి పరీక్షించు నిప్పటివారికిఁ దృప్తికరముగ నుండదు.

మాయాంతర్గత త్రిగుణముల మహిమ వేఱొకభాగమున వ్రాయఁబడినది. అద్వైత విశిష్టాద్వైత విషయములు మఱికొన్ని క్రిందఁ వ్రాయఁబడును.

మాయావాదము బౌద్ధసిద్ధాంతములో సైతమున్నది. శ్రీశంకరాచార్యులవారు మాయావాదము ననుసరించి పరబ్రహ్మమును దెచ్చియుంచినారని (శంకరాచార్యులను ప్రచ్ఛన్నబౌద్ధులనియు యీశ్వరుని నిరాకరించిన సాంఖ్యమతములో నీశ్వరునిఁ జేర్చి మాయావాదమును జేసినారు కావున ప్రచ్ఛన్న సాంఖ్యులనియు) పలికెదరు. సాంఖ్యమతమును విశేషభాగ మవలంబింపని సిద్ధాంత మెచటనులేదు. కావున నందఱును ప్రచ్ఛన్నసాంఖ్యులేను. వేదాంతతత్త్వములన్నియును సాంఖ్యాచార్యులనుండి యేర్పఱచఁబడినవేను, వారు ప్రమాణములులేని కారణంబున ... [illegible]

జనులు విశ్వసించుచుండిన యీశ్వరుని స్థాపించి సిద్ధాంతముఁ జేయనైరి. నిరీశ్వర వాదమును సిద్ధాంతీకరించిరి. పతంజలి యీశ్వరునిఁదెచ్చి యోగశాస్త్రమును సాంఖ్యపురీతిగనే కల్పించెను. శ్రీ శంకరాచార్యులవారు సైతము " ఆత్మను పరమాత్మను దెచ్చిపెట్టి " యించుక భేదముతో సాంఖ్యశాస్త్రమునే కల్పించిరి. వీరి వాదములలోని యీశ్వరుఁడు సమష్టిని నిర్గుణుఁడైనందున నట్టి దైవముండిననేమి యుండకున్ననేమి జనులకు బోధపడనందునఁ దృప్తికరముగ లేవని శ్రీ రామానుజాచార్యుల వారీశ్వరుని సగుణునిఁజేసి కొన్ని విశేషణము లీశ్వరునియందారోపించి సిద్ధాంతము నులభపఱచిరిగాని యాత్మ లీశ్వరుని స్వరూపమైనను నీశ్వరుని వంటియుండువారనిరి. ఈ సిద్ధాంతమును జనసామాన్యమునకుఁ దెలియదాయెను. పిదప శ్రీ మధ్వాచార్యులవారు జనసామాన్యమునకెల్లఁ దెలియులాగున ఆత్మలు వేఱు. ఈశ్వరుఁడు వేఱనియు ఆత్మ లీశ్వరుని సామీప్యముఁజేరి యతనినిఁజూచుచు నానందించుచుండు వారనియు సిద్ధాంత మొనర్చిరి. ఈ వాదసిద్ధాంతము లీయాచార్య పురుషులనుండియే యుత్పన్నములైనవి కావు. వేదములందేమి యుపనిషత్తులందేమి బ్రహ్మసూత్రములందేమి యీ వాదముల విషయ మచ్చటచ్చట సూచింపఁబడినవి. ఆచార్యపురుషులు జనించుటకు బహుకాలమునకుమున్నే యీ వాదము లుండినవి. జనసామాన్యమట్టి యవ్యక్తరూపమును గనుంగొనుటకు సాధ్యపడక నికాసులై నాస్తికులైనందున నట్టివారిని మార్గమునకుఁ దెచ్చుటకై యవతార పురుషులను గల్పించి పరమాత్మయే యీ యవతారమెత్తెనని జనులకు దైవముపై బుద్ధిఁగలుగఁజేసి భక్తి కుదిర్చిరి. దానినుండి జనులకు జ్ఞానోదయమై యొకరొక్కరు పైనఁ బలుకఁబడిన సిద్ధాంతముల ననుసరింపసాగిరి. కావున నాస్తికులమతము నన్నగిల్లెను. లోకసంస్కారణార్థమిది శ్రేయస్కర మార్గమనుటకు సందియములేదు.

ఇఁక శ్రీశంకరాచార్యులను ప్రచ్ఛన్నబౌద్ధులనిరి. కారణము, మాయావాదమేను, బౌద్ధులకు మాయావాద మెచ్చటినుండివచ్చెను? భగవద్గీతలో వాదము లేదా? (7), 25. " యోగమాయాసమావృతః " (4) 6 " సంభవామ్యాత్మ మాయయా " (7), 14, 15, " మమమాయాదురత్యయా " " మాయమేతాంతరన్తితే " " మాయయాపహృతజ్ఞానా " (18) 61 " యంత్రారూఢాని మాయయా " యని పలుకఁబడినది, భగవంతు నవ్యక్తశక్తి యాయయని తెలుపఁబడినది. భారత శాంతిపర్వములో భగవంతుఁడు నారదునకు విశ్వరూపము నగపఱచినపిదప " మాయాహ్యేషామయా సృష్టాయన్మాంపశ్యంతినారద " యని పలుకఁబడినది. శ్వేతాశ్వతరోప నిషత్తులో [4-10] " మాయాంతుప్రకృతిం విద్యాన్మాయినంతు మహేశ్వరం " అని పలుకఁబడినది. ఋగ్వేద (6-మం 47-16) లో " ఇంద్రోమాయాభిః పురురూప ఈయతే " యనియున్నది. ఇటుల మాయ రూపాత్మక స్వరూపప్రపంచమునకు మాయ, ప్రకృతి, యజ్ఞానము, అవిద్య, మిథ్యయని పూర్వకాలములోనే శ్రుతిస్మృతు లనేకములుండినవి. " ఏకంసద్విప్రా బహుధావదంతి " యను ఋగ్వేదవచనమురీతి నొకమాయకు ననేకనామము లుపయుక్తములైనవి. ఈ శబ్దములేగాని యీ వాదముగాని శ్రీ శంకరాచార్యులవారు తాము నవీనముగ గల్పించినవారుగారు.

సృష్టికాలమున పరబ్రహ్మముయొక్క ప్రభ సర్వమును నిండికొని యుండెను. ఆ, సత్యమగు పరబ్రహ్మముతప్ప మఱియేమియు నుండలేదు. అట్టి పరబ్రహ్మమునం దసత్యములగు సృష్టి బీజములనుంచికొని మాయ యెటులుండెను? అటు మాయ యున్నదనినచో పరబ్రహ్మము మాయయను రెండువస్తువులాయెఁ గదా! అది యొప్పినచో " ఏకమేవాద్వితీయ " మను శ్రుతివచనమునకు భంగము గలిగి ద్వైతముపుట్టదా? అను నాక్షేపణము సహజముగఁ గలుగును.

ఋగ్వేదములోఁ బదియవమండలము 129 సూక్తము 2-వ ఋక్కీరీతిగనున్నది.

" నమృత్యురాశీదమృతంనతర్హినరాత్ర్యాఅహ్నఆసీత్ప్రకేతః।
ఆనీదవాతం స్వధయాతదేకం తస్మాద్ధాన్యన్నపరః కించనాశా "

యని యున్నది.

వ్యక్తములగు పదార్థము లెవ్వియును లేనికాలమున " ఒక గొప్పవస్తువుండెను. దానికి పరబ్రహ్మమని జ్ఞానులనిరి. ఆ వస్తువునుండి కామము వెడలెను. దానినుండి యనేకవస్తువులు వెడలెనని యీ సూక్తములోఁ బలుకఁబడినది. ఆ సూక్తముయొక్క భాషాంతరీకరణము సృష్టిప్రకరణములో నేను వ్రాసినాను. మిగతది యెటులైన నుండినను మూలారంభమునఁ బ్రహ్మమను వస్తువొక్కటియ యని వేదప్రమాణమును బట్టినచో స్థిరమగుచున్నది కావున " ఏకమేవా ద్వితీయ మనునది సార్థకమేను. ఆ బ్రహ్మమునుండి కామములేక మాయవెడలెను. అపుడు ద్వైతమువచ్చెను. పిదప సృష్టిక్రమమంతయును ద్వైతమేను. ఈ ద్వైతసృష్టిలోఁ గొన్ని యవ్యక్తములయ్యెను. గొన్ని వ్యక్తములయ్యెనుగాని మూలారంభమున సర్వమును గర్భములోనుంచికొని యుండినది బ్రహ్మమేను. అంతమున నుంచికొనునదియు బ్రహ్మమే కావున " ఏకమేవాద్వితీయ " మనునది సార్థకమేను.

ఈ మాయావాదమును దిరస్కరించి పరబ్రహ్మమునకు సృష్టింపవలెనని యాశపుట్టెననినచో ననేకములగు ననర్థవాదములు పుట్టును. ఆశ పనికిఁ బ్రేరేచును కావునఁ బరబ్రహ్మము కర్మమునకు మొదలుపెట్టె ననవలసివచ్చును. పరబ్రహ్మ కర్మములెల్లఁ బుణ్యకర్మములుగ నుండవలసివచ్చును. అటులయిన జగత్తులోఁ బాపమెట్లు వచ్చెను. సుఖదుఃఖములెటు కలిగెను. జనన మరణములెటు ప్రాప్తిల్లెను. చేతనాచేతనములెటుగలిగెను. దైవమే మంచిచెడుంగులు పుట్టించెననిన దైవమునందే ద్వంద్వబుద్ధు లుత్పన్నములయ్యెనని యనవలసివచ్చును. అట్లైన దైవత్వమునకే కుందుగలుగును. మఱియొక కష్టమున్నది. సాంఖ్యుల ప్రకృతిపై నారోపింపఁబడిన యాక్షేపణయే యీ వాదముపైనను వచ్చును. సాంఖ్యుల ప్రకృతియే, కర్మస్వాతంత్ర్యము కలిగినది యనినపుడు పుణ్యపాపముల కర్మబంధముకూడా ప్రకృతికేయగుననియుఁ దన్నుఁదాఁ గట్టికొని విచ్చుకొనుటకు యత్నించుట సమ్మతింపఁదగినది కాదనియు నాక్షేపింపఁబడినది. పురుషుఁడు సృష్టికర్తయైనపు డదే యాక్షేపణము వచ్చునుగదా?

సృష్టిరహస్యము దైవమునకైనను దెలియునో తెలియదో యనినటుల నీ విషయ మెఱుంగుట కష్టతమమైనపని. అధ్యాత్మ సిద్ధాంతు లూహలపై యుక్తివాదములు సలుపుచు జనులలో మతద్వేషములు పెంచుచున్నారు. కావుననే భగవద్గీతలో నన్నివాదములను సముచ్చయింప యత్నింపఁబడినది,

మాయావాదముపైనను ననేకములగు నాక్షేపణలున్నవి. అయిన పండితులగువారు వానికెల్ల యుక్తి సమాధానములు చెప్పను సాధ్యమగునని నాకుఁ దోఁచెడు. హిందూ సిద్ధాంతములలోను పాశ్చాత్య సిద్ధాంతములలోను ప్రావీణ్యము నందిన యొకపండితుఁ డద్వైత సిద్ధాంతమురీతిగ నాత్మ పరమాత్మలో లీనమైనపుడు మానవుని జ్ఞానాభివృద్ధికి (Spiritual advancement) మార్గముండదని పలికినాఁడు. ఆశలుడిగి కర్మపాశములెల్లఁ ద్రెంచి ప్రకృతి ప్రాబల్యమును బటాపంచలుగఁ జాఱఁదోలి బ్రహ్మతేజోమయుఁడైనపుడు బ్రహ్మతేజములోనే కలిసిపోవును. అట్టివానికి జ్ఞానాభివృద్ధి యనఁగనేమి? అట్టి యద్వైతభావన లక్ష్యముగ నుంచికొని యభివృద్ధినందఁ బ్రయత్నించినచోఁ గోటిజన్మములకైన నద్వైతసిద్ధి గల్గునని పలుకనగును. ప్రతియొక సిద్ధాంతపరిణామ మిటులనేయుండును.

బ్రహ్మము నిర్గుణమను వాదముపై నాక్షేపణలు మెండుగఁ గల్పింపఁబడినవి. ఈ యాక్షేపణము లన్నియును నిర్గుణ శబ్దార్థము లక్ష్యపెట్టక పుట్టినట్టివి. అద్వైతుల బ్రహ్మము నిర్గుణుఁడను వాక్యమునకు "సత్వరజసమో" గుణములకు

లోఁబడినవాఁడు కాఁడని యర్థము. ఈ యర్థమునుబట్టి వేదాంతములోని యీ శబ్దమును సమన్వయించుకొనునెడల నిర్గుణవాద నిరశనమునకుఁ గారణమేమియు నుండదని నాకుఁ దోఁచెడు.

పైన నాచే వ్రాయఁబడిన సిద్ధాంతము లనుసరించినవారికి సత్కార్యవాదులనియు నారంభవాదులనియుఁ బరిణామవాదులనియు వివర్తవాదులనియు నిత్యాదినామములు వచ్చినవి. ఈ వాదముల యర్థము తెలిసినచో సిద్ధాంతము లేమైననియు సూక్ష్మముగ నెఱుంగనగును. బ్రహ్మశ్రీ వావిలాల శివావధానులవారు తామాంధ్రీకరించిన బ్రహ్మసూత్రములను గ్రంథములో నా వాదములన్నియును నచ్చటచ్చట వ్రాసినారు. వానిచే నేనీదిగువ వ్రాసినాను. కొన్నిమార్పులు గలవు.

స త్కా ర్య వా ద ము.

ఈ వాదము సాంఖ్యులది. వేదాంతులచే నంగీకృతము. కార్యము కారణమందనఁగా కారణస్వరూపముగ సూక్ష్మమైయుండి కార్యార్థులైన జనులచేఁ జేయఁబడు వ్యాపారములచే వ్యక్తమగును. పాలలోఁ బెఱుఁగు సూక్ష్మరూపముగనుండి పెఱుఁగునుఁ గోరువారిచే జేయఁబడు (చేమిరి) తోడుఁబెట్టుటయను వ్యాపారముచే నేర్పడుచున్నది. ఇటులనే కుండ మట్టియందు సూక్ష్మరూపముగనుండి, కుమ్మరిచేఁ జేయఁబడు వ్యాపారముచేఁ గుండఁగ నగపడుచున్నది. ఆ పెఱుఁగును, గుండయుఁ బాలయందును మట్టియందును లేనిచో జనుల వ్యాపారముచే నవి యెట్లుపుట్టును? లేనివి పుట్టునంటిరా, మట్టిలోనుండి పెఱుఁగు పుట్టవలెను. పాలలోనుండి కుండ పుట్టవలయును. అట్లు పుట్టుటలేదు. కారణములోఁ గార్యములేకయే క్రొత్తఁగాఁబుట్టునని తార్కికులందురు. అట్లైనచో పాలలోఁ గుండలేనట్లే పెఱుఁగును లేదుగానఁ బాలలోనుండి పెఱుఁగే పుట్టవలయును మట్టిలోనుండి కుండయే పుట్టవలెనను నియమము లేకపోవును. పాలలోఁ బెఱుఁగునుఁ బుట్టించు శక్తియును, మట్టిలోఁ గుండను బుట్టించుశక్తియును గలదని తార్కికులనియెదరు. ఆ శక్తియే కార్యమని సాంఖ్యయోగాద్వైత విశిష్టాద్వైతుల యభిప్రాయము. కార్యము "కారణాత్మనా" కారణమందున్నదని యద్వైతులును కార్యము సూక్ష్మరూపముగఁ గారణమందున్నదని సాంఖ్యులును నందురు. మాటమాత్రము భేదముగాని యర్థమొకటియేను.

ఆ ర ం భ వా ద ము.

కారణమువలనఁ గార్యముపుట్టినపిమ్మట నా కారణ కార్యములకు వేఱు

సేయుటకు వీలులేకున్నను గారణము కార్యముతోఁ గలసియున్నపుడుగాని వేఱుగానున్నపుడుగాని వానిని వేఱువేఱుగఁ దెలిసికొనుట కవకాశమున్నది. ఇందులకు దృష్టాంతము. కారణములగు దారములనువిడిచి కార్యమగు బట్ట వేఱుగలేకున్నను బట్టయందు దారములున్నవియను వ్యవహారమందు బట్టవేఱుగను, దారములు వేఱుగను బిలువఁబడుచున్నవి. దీనినే యారంభవాదము.

ప ర మా ణు వా ద ము.

అణువుల చేరికచే జగత్తు సృష్టియను వైశేషికుల వాదమిది. దీనిఖండన యుక్తి.

పరమాణువు లొకదానితోనొకటి కలిసి ద్వ్యణుకాది కార్యములను బుట్టించునపుడు, నొకపరమాణువు, మఱియొక పరమాణువుతోఁ గలియునపుడు, సంపూర్ణముగఁ గలియునా? లేక యొకభాగముతోమాత్రము గలయునా! సంపూర్ణముగఁ గలిసెనని యందుమా? నిరవయవములుగాన సంపూర్ణముగ నెన్నిమార్లు కలసినను బరమాణువులుగానే యుండునుగాని సావయవములు కానేరవు. సావయవములు కానపుడు వానిసంయోగమెక్కడ? దానివలన స్థూలపదార్థ సృష్టియెక్కడ? రెండవపక్షములోఁగూడ పరమాణువు నిరవయవముగాన నొకభాగముతోఁ గలియుననుటకు వీలు గలుగనే గలుగదు.

అ వ చ్ఛి న్న వా ద ము.

జీవుఁడు బ్రహ్మముయొక్క యంశమైనచో జీవుని సుఖదుఃఖములు బ్రహ్మమునకుఁ గూడఁ గలుగవలయు. కరచరణాదులగు నంశములందుఁగల సుఖదుఃఖములు, అంశియగు దేహమునందుఁగూడ నున్నట్లు జీవునందుఁగల సుఖదుఃఖములు బ్రహ్మమందుఁగూడ నుండనోపునని శంకింపఁదగదు. ఏలయన:--జీవుని సుఖదుఃఖములు తదుపాధియగు బుద్ధియొక్క సంబంధమువలనఁ గలిగినవి. బ్రహ్మమునకు నుపాధిలేదుగాన నతనికి సుఖదుఃఖములు చెందవు. అది యెట్లనిన, సూర్యప్రకాశము కిటికీసందులోఁ బ్రవేశించినపుడు వంకరగ భాసించినను, ఆ వంకర గుణము సూర్యకాంతికిలేదు. నీటికుండలోఁ బ్రతిబింబించిన సూర్యప్రతిబింబమునకుఁ జలనాదిదోషములు గన్పట్టుచున్నను దదంశియగు సూర్యునందుఁ జలనాదులు లేనట్లుల, బుద్ధియందున్న జీవునిదోషములు బ్రహ్మచైతన్యమందుండవు. బ్రహ్మము సర్వబుద్ధులయందును జీవస్వరూపముతోఁ బ్రవేశించి యేకమైయుండఁగ, శత్రువుల నుండి తొలఁగిపోవలయుననియును, మిత్రుని సేవింపవలెననియును, లోనగు లౌకికాలౌకిక విధినిషేధములెట్లు సంగతములగుననిన, అగ్ని యేకమయినను శ్మశాన దేశ

సంబంధము కలిగినపుడది యగ్రాహ్యమనియు, శ్రోత్రియ గృహసంబంధము కలిగిన యెడ గ్రాహ్యమనియు నుపాధిభేదము ననుసరించి చెప్పినట్లు, ఉపాధి తారతమ్యము ననుసరించి యీ విధినిషేధములు ప్రవర్తించినవిగాని యాత్మతత్త్వమునుబట్టి వర్తించినవి కావు. జీవులు, అవిద్యాంతఃకరణములు లోనగు నుపాధుల నాశ్రయించి యుండుటచేతను ఉపాధులు పరిచ్ఛిన్నములు గనుకను, ఒకయుపాధిలోనున్న జీవుఁడు మఱియొక యుపాధిలో వ్యాపించుటకు వీలులేనందునను, ఆ యుపాధులయొక్క సుఖదుఃఖ పుణ్యపాపాదు లితరములగు నుపాధులయందు సంక్రమింపనేరవు. ఇదియే యవిచ్ఛిన్నవాదము.

ప్ర తి బిం బ వా ద ము.

ప్రతిబింబసూర్యులు, సూర్యుని యంశములైనట్లు జీవుని బ్రహ్మాంశమని చెప్పితిమిగదా? జీవుండేకమయినను నతని యుపాధులగు నవిద్యాంశములనేకములు గాన వానిలోఁ బ్రతిఫలించిన బహ్మచైతన్యముగూడ ననేకములని వ్యవహరింపఁబడుచున్నవి. సూర్య ప్రతిబింబములలో నొకప్రతిబింబమునకుఁ జలచలనాదులచేఁ జలనాదులుగలిగినపు డితరప్రతిబింబములకు నా చలనాదులుగలుగనట్లు బ్రహ్మప్రతిబింబమగు నొకజీవుని సుఖదుఃఖాదు లితర జీవులకంటవు. బింబభూతమగు బ్రహ్మమునకు బొత్తిగనంటవు. ఇదియే ప్రతిబింబవాదము.

ప రి ణా మ వా ద ము.

కార్య కారణములకు స్వభావమున భేదమున్నను కార్యకారణ భావము గూడఁ గలదుగదా! దృష్టాంతము, పేఁడజడము, తేలుచేతనము. అయినను దానిలోనుండి తేలుపుట్టుచున్నది. పట్టుదారములకు వానిలోఁబట్టు పురుగులకు, నిదియే న్యాయము. కాన నచేతనమువలనఁ జేతనము పుట్టుచున్నది. మఱియుఁ జేతనమువలన నచేతనముఁగూడఁ బుట్టుచున్నది. మనదేహములోనుండి కేవలజడములగు గోళ్లు వెంట్రుకలు పుట్టుచున్నవి. సాలెపురుగు నోటిలోనుండి దారములు పుట్టుచున్నవి. గనుక సాంఖ్యకాణాదులు చెప్పుజడములగు ప్రధానపరమాణువుల వలన జడప్రపంచము పుట్టునను నియమములేదు. చైతన్యఖనియగు బ్రహ్మమువలన నచేతనరూపమగు ప్రపంచము పుట్టవచ్చుననుయుక్తి సయుక్తిముగను ననుభవ సిద్ధముగనునున్నది. కార్యకారణములకు నభేదమున్నను గార్యములో నొకదానికంటె మఱియొకటి వేఱుగనుండవచ్చును. దృష్టాంతము. మట్టివలనఁ బుట్టిన కుండయు, మూఁకుడు మొదలయినవియు మట్టికంటె భిన్నములుకాకపోయినను పరస్పరము భిన్నములేగదా? అటులనే, కారణమైన బ్రహ్మమునకును, కార్యము

లైన భోక్త (సుఖదుఃఖము లనుభవించుజీవుఁడు) భోగ్యములకు (సకల జడవస్తువులు వానివలనఁ గలుగుసుఖదుఃఖాదులు) ను అభేదము కలిగియున్నను భోక్తృ భోగ్యములొండొరులు భిన్నములుగ నుండవచ్చును. దృ:— సముద్రము నందుఁబుట్టిన బుగ్గలు అలలు సముద్రతత్త్వముకంటె భిన్నతత్త్వములు కాకపోయినను అనఁగా జలవికారములయినను బుగ్గ-లలకంటె వేఱుగనున్నవికదా? ప్రపంచము బ్రహ్మముయొక్క పరిణామమని చెప్పెడువారి సమాధానమును జెప్పుదురు. ఈ పరిణామవాదము సాంఖ్యయోగ విశిష్టాద్వైతులకు సమ్మతము. అద్వైతులకు నుపాసనాకాండము ప్రతిపాదించునపుడు సమ్మతము. అనఁగా మాయతోఁగూడిన బ్రహ్మము (సగుణబ్రహ్మము) ప్రపంచమునకు నుపాదానకారణమని చెప్పునప్పుడీవాదము సమ్మతము. కారణము తనస్వరూపముమారి కార్యమగుట పరిణామమని యిదివరలోనే చెప్పియుంటిమి.

వివర్తవాదము.

కారణము కారణస్వరూపము మారకయే, కార్యరూపముగ మారినట్లగపడుట వివర్తమనఁబడును. నిర్గుణబ్రహ్మము జగత్కారణమని చెప్పునప్పుడు భోక్తృ భోగ్యప్రపంచము బ్రహ్మముకంటె వేఱుగలేదు. ముత్యపుఁ జిప్పభ్రమచేత వెండివలెఁ గనఁబడినట్లు, బ్రహ్మమే యజ్ఞానముచేఁ బ్రపంచముగఁ గనఁబడుచున్నది. కావున బ్రహ్మమే సత్యము ప్రపంచము మిథ్యలేక యనిర్వచనీయముకాని బౌద్ధులలోని శూన్యవాదులు చెప్పు కుందేటికొమ్మువలెఁ దుచ్ఛముకాదు. సత్యమన మూఁడు కాలములయందు దేనిచేతను బాధింపఁబడక యుండునది. మిథ్యలేక యనిర్వచనీయమనఁగా యిదియని యెదుటనున్నట్లగపడి, విమర్శింపఁగా లేకపోవునది. ఎండమావులు, శుక్తిరజతము, రజ్జుసర్పము. ఇందుల కుదాహరణములు భ్రమకాలములో నీరుగాను వెండిగాను పాముగాను గనఁబడినను విమర్శమీద భ్రమనివారణకాఁగా, యా నీరు మొదలైనవి లేనివైతోఁచును. అట్లే ప్రపంచముఁగూడ వ్యవహారకాలమునందు గనఁబడుచున్నప్పటికిని శ్రుతియుక్త్యనుభవములచే విమర్శింపఁగ బ్రహ్మాత్మైక్యజ్ఞానముదయించినతోడనే బ్రహ్మముకంటె వేఱుగఁగనఁబడదు. ఇత్యాది హేతువులనుఁ బురస్కరించి ప్రపంచము మిథ్యయనుట యద్వైతులసిద్ధాంతము. దీనినే వివర్తోపాదానమందురు. ఈ వాదమునకే మాయావాదమని రూఢి.

శ్రీశంకరాచార్యులకు బహుకాలముక్రిందమున్నె పైవాదములన్నియును నుండెను. ఉపనిషత్తులలోని కొన్నిశబ్దములే యీ సమస్తవాదములకు మూలాధారములైనవి. శ్రీశంకరాచార్యులు మాయావాదము ననుసరించి భాష్యములు

వ్రాసిరి. అంతకుమున్నె బోధాయనులవారు పరిణామవాదమున ననుసరించి బ్రహ్మసూత్రములకు భాష్యము చేసియుండిరి. శంకరాచార్యులవారు తమభాష్యములో బోధాయన భాష్యములోని కొన్నియంశములను ఖండించిరి. పిదప మూఁడువందల సంవత్సరములపిదప శ్రీరామానుజాచార్యుల వారవతరించి బోధాయన భాష్యము ననుసరించి శ్రీ శంకరాచార్యులవారి మాయావాదములో విశేషభాగము ఖండింప యత్నించిరి. శ్రీ శంకరాచార్యులవారి మాయావాదమే భరతఖండమునందేగాక పాశ్చాత్య ప్రపంచములోసైతము విశేష ప్రసిద్ధినందినది. ఇటీవల నేను సీతానాథతత్త్వభూషణముగారి గ్రంథములు చదువుచుండఁగ వారు శ్రీ రామానుజాచార్యులవారి విషయమును బలుకుచు శ్రీ రామానుజాచార్యులవారు తార్కిక ప్రావీణ్యము గలవారనియు శ్రీ శంకరాచార్యుల వారధ్యాత్మిక జ్ఞానప్రావీణ్యము గలవారనియు వ్రాసినారు. వారిరువురును గొప్పజ్ఞానులనుటకు సందియములేదు. శ్రీ శంకరాచార్యులవారేకత్వమును సాధించిరి. శ్రీరామానుజాచార్యులవారేకత్వములో భిన్నత్వమును సాధించిరి. పిదప శ్రీ మధ్వాచార్యులవారు సంపూర్ణభిన్నత్వమును సాధించిరి. జనుల యాధ్యాత్మిక జ్ఞానాభివృద్ధికి వీరు కారకులనుట కేసందియము లేదు. అయితే వీరిసిద్ధాంతముల నవలంబించినవారు తామనుసరించిన సిద్ధాంతములే హెచ్చని వాగ్వాదములు బెంచి మతద్వేషములు హెచ్చింపఁజేసిరి. భరతఖండములో శ్రీ రామానుజాచార్యులకుఁ బూర్వము దేవాలయములేగాని విగ్రహారాధనలేగాని విశేషముగనుండలేదు. బహుకాలమునకుమున్నె పాంచరాత్రాగమవిధానములుండెనుగాని దానికి నంతటిప్రాచుర్య ముండలేదు. శ్రీ రామానుజాచార్యులవారా పాంచరాత్రాగమములను దమమతములోఁ జేర్చినందున దానికి హెచ్చు ప్రాచుర్యము వచ్చెను.

మాయావాదమును స్థిరపఱచునట్టి గాథలనేకములున్నవి బహుకాలమునుండి జనులనోటిలో నాడుచున్నవి. అన్నియును వ్రాయక యొకగాథనుమాత్రము వ్రాసి యీ యుపన్యాసం బింతటితో ముగించెద.

“ఒకానొక దినంబున నారదఋషి భగవంతునిఁగూడి సంచరించుచు మార్గమున “మాయ” యన నేమియని ప్రశ్నించెనఁట. అది యనిర్వచనీయమని భగవంతుఁడు బదులిడి మాటలాడుచు నడచుచుండ మార్గమున నొకయువతి మనోహరాకారంబుఁదాల్చి తన సుందరముఖచంద్రమునుండి చిఱునగవను వెన్నెలఁ బ్రసరింపఁజేయుచుఁ దనవిశాలలోచన కటాక్షబాణములఁ జూపరుల ధైర్య మేపు

మూపుచు వారు ముందుకుగిడనటులఁ దనకేశపాశముల బంధించుచు హొయలు గులుకుచు మోహినీదేవతయో యనునటులఁ గట్టెదుటఁ గనఁబడెనఁట. దానినిఁ జూచినతత్క్షణముననే నారదులకు నింద్రియనిగ్రహము చెడి బ్రహ్మచర్యవ్రతము పటాపంచలయి యా మందగమనను వెంబడించి యరణ్యములోనున్న దానికుటీరము ప్రవేశించి యా వెలఁది యెంతగ వలదని బతిమాలినను వదలక బలాత్కరించి సంసారచక్రములోఁబడి మోహాంధకారములో మునింగి చిక్కులఁబడుచు, సంతానవృద్ధి యయిన పిల్లలను వారిరక్షణార్థము కష్టపడుచుండెనఁట. ఒక్కదినంబునఁ గళత్రపుత్రసహితుండై నారదుఁడు దోవనడచుచుండ యొకయేరడ్డపడెను. అందు నీరుండని కారణంబున దానిని దాఁటుచుండఁ బ్రవాహము హెచ్చుగవచ్చి పుత్రకళత్రాదులు కొట్టికొని పోయిరఁట. నారదుఁడుమాత్రము శ్రమపడి యెట్టకేలకుఁ దీరముఁజేరి యవాశిగ దారపుత్రాదులను దలంచికొని పరితపించుచుండెనఁట. అంతలోనే భగవంతుఁడొక ముదసలి బ్రాహ్మణవేషమునుదాల్చికొని వచ్చి నారదుని సమీపించి పరితాపంబునకుఁ గారణంబు విచారింప నారదుఁడు తన దారపుత్రాదుల వియోగముచెప్పి దుఃఖింపసాగెనుగాని తానెవరయినదిన్ని తెలుపఁజాలక పోయెనఁట. అపుడు భగవంతుఁడు నారదుల యజ్ఞానంబుఁ దొలఁగింపఁగనే నారదులకు పూర్వస్మరణవచ్చి భగవంతునకు నమస్కరించెనఁట. భగవంతుఁడపుడు నారదా! “ మాయ ” యన నేమని నన్నుఁ బ్రశ్నించితివి. అనిర్వచనీయమదియని నేఁదెలుప దానివిషయము మఱలమఱలఁ బ్రశ్నింపసాగితివి. దానినిఁ దెలియుటకు స్వానుభవమే కారణమనియెంచి నిన్ను మాయలో ముంచితిని. ఇపుడు “మాయ” యనునది యెట్టిదియను సంగతి నీకుఁదెలిసెనుగదా? అనుభవమునకు వచ్చెనుగదా? యని యంతర్థానమయ్యెనఁట. ఇట్టిగాథలు యోగవాశిష్ఠములో హెచ్చుగనున్నవి.

ఈ మాయావాదమునుగుఱించి బ్ర॥ బాలగంగాధర తిలక్కుగారు తమ గీతారహస్యమను గొప్పగ్రంథములో యుక్తియుక్తముగ మహారాష్ట్రభాషలోఁ జర్చించినవిషయమును సంక్షేపముగ భాషాంతరీకరించి క్రింద వ్రాసినాఁడను.

END OF
TITLE